నేటి నుంచి టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు

కొత్తచెరువు, మార్చి 21: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు శుక్రవారం నుంచి నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) మీనాక్షి ప్రకటనలో తెలిపారు. డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడింగ్, లోయర్, హయ్యర్ గ్రేడ్‌లో నాలుగు రోజులపాటు పరీక్షలు కొనసాగుతాయన్నారు. విద్యార్థులు హాల్ టిక్కెట్లను www.bse.ap.gov.in వెబ్‌సైట్‌లో పొందవచ్చన్నారు. గంట ముందే పరీక్షాకేంద్రానికి చేరుకోవాలన్నారు. హాల్ టిక్కెట్‌తోపాటు ఏదైనా గుర్తింపు కార్డు వెంట తీసుకురావాలని డీఈఓ సూచించారు.



కొత్తచెరువులో బుధవారం వైసీపీ ప్రచారంలో చిందులు వేస్తున్న వలంటీర్ హర్షద్

బరితెగింపు..!





చెవికెక్కని ఈసీ ఆదేశాలు

పేట్రేగిపోతున్న వలంటీర్లు, ఉద్యోగులు
వైసీపీ కార్యకర్తల్లా ప్రచారం
నలుగురు వలంటీర్లపై వేటు

పుట్టపర్తి, మార్చి21(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ప్రచారంలో వలంటీర్లు, ప్రభుత్వోద్యోగులు పాల్గొనకూడదని ఎన్నికల సంఘం (ఈసీ) హెచ్చరికలు చేస్తూనే ఉంది. న్యాయస్థానాలు కూడా ఆదేశాలు జారీ చేస్తున్నాయి. ఉన్నతాధికారులు కూడా ఆ మేరకు పదేపదే ప్రకటనలు చేస్తున్నారు. వీటిని కొందరు వలంటీర్లు చెవికెక్కించుకోవడంలేదు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తుంగలో తొక్కుతూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రజాధనాన్ని వేతనంగా పొందుతూ.. అధికార వైసీపీ అభ్యర్థులకు ఊడిగం చేస్తున్నారు. ఎన్నికల కోడ్ కూసినా బరితెగించి వైసీపీ అభ్యర్థుల ప్రచారంలో పాల్గొంటున్నారు. ఈవిషయమై పదేపదే ఫిర్యాదులు వస్తున్నా.. జిల్లాలో యంత్రాంగం కూడా అంతగా స్పందించడంలేదనే విమర్శలున్నాయి. ఇదే అదునుగా వలంటీర్లు మరీ బరితెగిస్తున్నారు. ఇటీవల పుట్టపర్తి, కదిరి వైసీపీ అభ్యర్థుల తరపున వలంటీర్లు, కొందరు ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధి హామీ సిబ్బంది ప్రచారంలో పాల్గొన్నారు. ఎన్నికల నియమావళికి ఉల్లంఘించారని ఇద్దరు ఉపాధ్యాయులను బుధవారం జిల్లా విద్యాశాఖాధికారి సస్పెండ్ చేశారు. ఇవన్నీ మీడియా ద్వారా బహిర్గతమైనవే. వైసీపీ అభ్యర్థుల వెంట ప్రచారంలో పాల్గొన్న వలంటీర్లపై మీడియాలో ఫొటోలతో కథనాలు వస్తే తప్ప.. వేటు వేయకపోవడం ఎన్నికల అధికారుల తీరుపై విమర్శలకు తావిస్తోంది.

వైసీపీ సేవలో వలంటీర్లు

ఆయా నియోజకవర్గాల్లో వలంటీర్ల పర్యవేక్షణ కోసం వైసీపీ మండలస్థాయి అధికారుల (ఎంఎల్‌వో) పేరుతో నియమాకాలు చేపట్టారు. వీరు ఇటీవలే ఆయా నియోజక వర్గాల్లో రహస్య సమావేశాలు నిర్వహించి వైసీపీ అభ్యర్థుల గెలుపునకు పనిచేస్తున్నారు. వీరు.. వలంటీర్లు, వైసీపీకి అనుసంధానకర్తగా వ్యవహరిస్తున్నారు. వైసీపీ అభ్యర్థుల గెలుపునకు అందరూ ప్రచారంలో పాల్గొనాలని సూచిస్తున్నారు. 'అప్పగించిన మొబైల్‌ఫోన్లు ఇతరత్రా సామగ్రి తిరిగివ్వాల్సిన పరిస్థితి రావచ్చు. కాబట్టి తరచూ గోప్యంగా సమావేశాలు నిర్వహిద్దాం. ప్రభుత్వం ద్వారా లబ్ధిపొందిన వారందరనీ కలిసి, పార్టీకి ఓటేసేలా కృషి చేద్దామం'టూ దిశానిర్దేశం చేస్తున్నారు. వలంటీర్ల పేరుతో ఊరూవాడా సొంత సైన్యాన్ని నియమించుకున్న వైసీపీ.. జనం సొమ్ముతో గౌరవ వేతనం చెల్లిస్తోంది. కొందరు వలంటీర్లు, ఉపాధి సిబ్బంది, ప్రభుత్వోద్యోగులు వైసీపీ ప్రచార బాధ్యతలను భుజాన వేసుకున్నారు. ప్రజాధనాన్ని జీతంగా తీసుకుంటున్న వీరంతా ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. కొందరు వలంటీర్లు.. వైసీపీ కార్యకర్తల్లా మారి ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చినా వైసీపీ అభ్యర్థులు, నాయకులతో కలిసి ప్రచారం చేస్తున్నారు.

అధికార పార్టీ కార్యకర్తల్లా..?

పుట్టపర్తి నియోజకవర్గంలో వలంటీర్లతోపాటు ఉపాధి హామీ సిబ్బంది స్వామిభక్తి చూపిస్తున్నారు. ఐదేళ్లలో ఎక్కడా ఒక్క అభివృద్ధి పని కూడా చేయని వైసీపీని ఓడించాలని ప్రజలు పట్టుదలతో ఉన్నారు. ఈనేపథ్యంలో వైసీపీ నేతలు.. వలంటీర్లను రంగంలోకి దించుతున్నారు. ఓటు వేయకపోతే సంక్షేమ పథకాలు తొలగిస్తామనీ, పింఛన్లు నిలిపేస్తామని హెచ్చరిస్తున్నారు. వైసీపీ పుట్టపర్తి నియోజకవర్గ అభ్యర్థి శ్రీధర్‌రెడ్డికి మద్దతుగా ఓబుళదేవరచెరువు మండలం టీ కుంట్లపల్లి, చెర్నోపల్లిలో వలంటీర్లు మంజుల, అనిల్‌కుమార్ పార్టీ కండువాలు వేసుకుని ప్రచారం చేశారు. కొత్తచెరువులోని బీసీ కాలనీలో వలంటీర్లతో పాటు డీలర్లు, వైన్‌షాపు సేల్స్‌మెన్ పాల్గొన్నారు. ఇలా జిల్లావ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో కొందరు వలంటీర్లు బరితెగించి వైసీపీ అభ్యర్థుల వెంట ప్రచారంలో కార్యకర్తల్లా అంటకాగుతున్నారు. కోడ్ అమలులోకి వచ్చి ఆరు రోజులు గడిచినా ఉన్నతాధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలకు తావిస్తోంది.

నలుగురిపై వేటు

వైసీపీ పుట్టపర్తి అభ్యర్థి దుద్దకుంట శ్రీధర్‌రెడ్డి వెంట ప్రచారంలో పాల్గొన్న నలుగురు వలంటీర్లను గురువారం తొలగించారు. ఓబుళదేవరచెరువు మండలం టీ కుంటపల్లిలో వలంటీర్లు ఆదినారాయణ, నరసింహులును తొలగించారు. కొత్తచెరువు మండలానికి చెందిన వలంటీర్లు హర్షద్, సాయిప్రకాశ్‌ను తొలగించారు.

ఇంటి గుట్టు.. వలంటీర్‌కు ఎరుక!

వారివద్దే స్మార్ట్‌ఫోన్లు, సిమ్‌కార్డులు
వైసీపీకి అనుకూలంగా సామాజిక మాధ్యమాల్లో ప్రచారం

కదిరిఅర్బన్, మార్చి 21: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినా, ప్రభుత్వం అందించిన స్మార్ట్‌ఫోన్లు వలంటీర్ల వద్దే ఉన్నాయి. ఎన్నికల నిబంధనలు అమలులోకి రావడంతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఆగిపోయాయి. పథకాల ప్రక్రియ స్తంభించింది. వలంటీర్ల వద్ద స్మార్ట్‌ఫోన్లు, సిమ్‌కార్డులు, డివైజ్‌లు అధికారులు స్వాధీనం చేసుకోవాల్సి ఉంది. ఒక వలంటీర్ ఫోన్‌లో 50నుంచి వంద కుటుంబాలకు సంబంధించిన సమగ్ర సమాచారం నిక్షిప్తమై ఉంది. ఆ సమాచారంతో వారు ఎన్నికల్లో వైసీపీకి అనుకూలంగా వ్యవహరించడంతోపాటు ఆ కుటుంబాల నుంచి ఓట్లు రాబట్టేందుకు పావులు కదిపే అవకాశం ఉంది. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన వెంటనే వలంటీర్ల వద్ద ఉన్న స్మార్ట్‌ఫోన్లను స్వాధీనం చేసుకోవాల్సి ఉన్నా, అధికారులు ఆదిశగా చర్యలు తీసుకోకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వలంటీర్లు ఆ ఫోన్లు నుంచి డేటాను ఇతర ఫోన్లలోకి అప్‌లోడ్ చేసుకుంటున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

చాలావరకు వైసీపీ వర్గీయులే..

వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత వలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చింది. 50నుంచి వంద ఇళ్లకు ఒక వలంటీర్‌ను నియమించారు. వారిలో చాలావరకు వైసీపీ కార్యకర్తలే. నాయకుల అనుచరులే. వైసీపీ నేతల సిఫార్సులతో వారు విధుల్లో చేరారు. ప్రజాప్రతినిధుల దయతో ఉద్యోగాలు వచ్చాయన్న ఉద్దేశంలో వారి పట్ల స్వామిభక్తి చాటుకునేందుకు బరితెగిస్తున్నారు. వలంటీర్లపై మండలానికి ఒక ఎంఎల్‌ఓ ఉన్నారు. ఇతడికి నెలకు రూ.20వేలు గౌరవ వేతనం ఇస్తారు. ఎంఎల్‌ఓ.. వలంటీర్లకు నిత్యం అందుబాటులో ఉంటారు. 'ఎవరెన్ని చెప్పినా భయపడద్దు.. వైసీపీ అభ్యర్థులను గెలిపించుకునేందుకు సమష్టిగా కష్టపడి పనిచేద్దాం' అంటూ తమ పరిధిలోని కుటుంబాలతో ఓట్లు వేయించాలని సందేశాలు పంపడం, ఫోన్లలో మాట్లాడడం చేస్తున్నారు.

నియమావళిని పాటించకుండా...

ఎన్నికల సంఘం ఆదేశాలు, ప్రవర్తనా నియమావళిని లెక్క చేయకుండా వైసీపీ అనుకూల ప్రచారం చేపట్టిన కొంత మంది వలంటీర్లు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిపై అధికారులు చర్యలు తీసుకున్నప్పటికీ మిగతావారిలో ఆ భయం కనిపించట్లేదు. ఏమాత్రం లెక్కచేయకుండా పార్టీ ప్రచారాల్లో పాల్గొంటున్నారు. సీఎం జగన్ ప్రసంగాలు, కీలక వ్యాఖ్యలను వలంటీర్ల వాట్సాప్ గ్రూపుల్లో ప్రచారం చేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం ద్వారా ఒక్కో కుటుంబానికి ఎంత లబ్ధి చేకూరిందో లెక్కలు లేసి మరీ ప్రచారం నిర్వహిస్తున్నారు. ఫేక్ సర్వేలు పెట్టి జగన్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారనీ, సీఎంను పొగుడుతూ పాటలు, ప్రచార పోస్టులు పెడుతున్నారు. ప్రతిపక్ష పార్టీల నేతుల, ప్రధాని మోదీని విమర్శిస్తూ రూపొందించిన ప్రచారాలను పోస్టు చేస్తూ ఓటర్లను ప్రభావితం చేస్తున్నారు. ఇటీవల విశాఖలో ఏర్పాటుచేసిన విజన్ విశాఖ సదస్సులో సీఎం జగన్ ప్రసంగంలోని కీలక వ్యాఖ్యలను వలంటీర్ల వాట్సాప్ గ్రూపుల్లో ప్రచారం చేశారు. పాదయాత్ర తరహాలో మళ్లీ సీఎం జగన్ బస్సు యాత్ర ఈనెల 27 నుంచి ఇడుపులపాయనుంచి ప్రారంభిస్తున్నారని సోషల్ మీడియాలో హోరెత్తిస్తున్నారు.

సచివాలయాల్లో హాజరు సైతం..

ప్రజలకు సేవ చేసినందుకుగాను వార్డు, గ్రామ సచివాలయ వలంటీర్లకు ప్రభుత్వం గౌరవ వేతనం ఇస్తోంది. ఈనెల 16న మధ్యాహ్నం 3 గంటలకు ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చింది. దీంతో వలంటీర్లు.. ప్రజాసేవ చేసేందుకు అవకాశం లేదు. సచివాలయాల్లో వలంటీర్ల లాగిన్ల ద్వారా చేపట్టే కార్యక్రమాలను ప్రభుత్వం ఆపివేసింది. వలంటీర్లు మాత్రం సచివాలయాలకు వచ్చి ఉద్యోగులతో సమానంగా హాజరు వేస్తున్నారు. పనిచేయకుండా హాజరు వేస్తే గౌరవ వేతనం ఇస్తారు. పనిచేయించుకోనపుడు హాజరు ఎందుకు వేయించుకుంటున్నారన్నది ప్రశ్నార్థకం.



రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సెహరీ
పుట్టపర్తి	6.34 శుక్రవారం (సాయంత్రం)	5.01 శనివారం (ఉదయం)
కదిరి	6.31 శుక్రవారం (సాయంత్రం)	5.07 శనివారం (ఉదయం)
ధర్మవరం	6.36 శుక్రవారం (సాయంత్రం)	5.04 శనివారం (ఉదయం)
హిందూపురం	6.34 శుక్రవారం (సాయంత్రం)	5.08 శనివారం (ఉదయం)
పెనుకొండ	6.33 శుక్రవారం (సాయంత్రం)	5.05 శనివారం (ఉదయం)

ఇంటి నుంచే ఓటు..

దివ్యాంగులు, వృద్ధులకు అవకాశం
జిల్లాలో 25 వేల మందికి చాన్స్



పుట్టపర్తి, మార్చి 21: వృద్ధులు, దివ్యాంగులు ఓటు వేయాలంటే చాలా ఇబ్బందులు పడేవారు. వారిని ప్రత్యేకంగా వాహనాల్లో తీసుకొచ్చి, భుజాలపై ఎత్తుకుని పోలీసు కేంద్రానికి తీసుకెళ్లేవారు. వారితో ఓటు వేయించేందుకు నానా తంటాలు పడేవారు. మరికొంతమంది వృద్ధులైతే క్యూలైన్‌లో గంటల తరబడి వేచి ఉండేందుకు ఇబ్బందులు పడేవారు. ఈ తిప్పలు పడలేక పలువురు ఓటుకు దూరంగా ఉండేవారు కూడా. వారి కష్టాలను దృష్టిలో పెట్టుకుని ఎన్నికల సంఘం ప్రత్యేక అవకాశాన్ని కల్పించింది. ఇంటి నుంచే ఓటు వేసే వెసులుబాటు ఇస్తోంది. ఇదివరకు ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, ఉద్యోగులకు మాత్రమే పోస్టల్ బ్యాలెట్ అవకాశం ఉండేది. ఈసారి ఎన్నికల సంఘం.. దివ్యాంగులు, వృద్ధులకు ఇంటి వద్దే ఓటు వేసే వెసులుబాటు ఇచ్చింది. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చాక ఆయా అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని దివ్యాంగులు, వృద్ధులు.. రిటర్నింగ్ అధికారికి దరఖాస్తు చేసుకుంటే ఇంటి నుంచే ఓటు వేసేందుకు అవకాశం కల్పిస్తారు.



25వేల మందికి అవకాశం

జిల్లా వ్యాప్తంగా ఆరు నియోజకవర్గాల పరిధిలో దివ్యాంగ ఓటర్లు 18,095 మంది ఉన్నారు. 80 ఏళ్ల పైబడిన వృద్ధ ఓటర్లు 7,300 మంది ఉన్నారు. వీరందరికీ పోలింగ్ రోజు ఎన్నికల సంఘం ఇంటి నుంచే ఓటు వేసే అవకాశం కల్పిస్తోంది. దీనిపై వృద్ధులు, దివ్యాంగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్

ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగులతో పాటు 33 శాఖల్లో పనిచేసే ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు వినియోగించుకునేందుకు కేంద్ర ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. లోక్‌సభ, శాసనసభ ఎన్నికల్లో వివిధ సేవల్లో పాల్గొనే ఉద్యోగులతోపాటు విధుల్లో ఉన్న ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు సౌకర్యం కల్పించింది. వీరికోసం నోడల్ అధికారిని నియమించడంతోపాటు పోస్టల్ బ్యాలెట్ కోసం 12-డీ ఫారం ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. రైల్వే, విద్యుత్, బీఎస్ఎన్ఎల్, దూరదర్శన్, డెయిరీ ఉద్యోగులు, ఆరోగ్య శాఖ, రోడ్డు రవాణాసంస్థ, విమానయానం, అగ్నిమాపక, అంబులెన్స్, ట్రాఫిక్, జైలు, సమాచార ప్రజాసంబంధాల శాఖ, అటవీశాఖలతోపాటు మొత్తం 33 శాఖలకు చెందిన ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవచ్చు.

ఉష్ణోగ్రతలు (గురు)

	గరిష్ఠం	కనిష్ఠం
పుట్టపర్తి	35.0	23.0
కదిరి	33.0	22.0
ధర్మవరం	36.0	24.0
హిందూపురం	34.0	23.0
పెనుకొండ	35.0	23.0

అడ్డంగా అమ్మేశారు..!

పాఠశాలలోని కంప్యూటర్లు గుజిరీకి..

పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన కంప్యూటర్లు, సంబంధిత సామగ్రిని అడ్డంగా అమ్మేశారు. కనీసం పాఠశాల యాజమాన్య కమిటీకి కూడా తెలియకుండా ప్రధానోపాధ్యాయురాలు గుజిరీకి విక్రయించారు. తద్వారా వచ్చిన సొమ్ము కూడా పాఠశాల రికార్డుల్లో జమ చేయకపోవడం శోచనీయం. జిల్లాలోనే అతి పురాతనమైన మునిసిపల్ పాఠశాలల్లో ఒకటైన హిందూపురం మహాత్మాగాంధీ (ఎంజీఎం) స్కూల్‌లో ఈ తంతు సాగింది. ఈ అక్రమ వ్యవహారం ఆలస్యంగా వెలుగుచూసింది. దీంతో అప్రమత్తమైన హెచ్‌ఎం విక్రయించిన వాటిలో కొన్నింటిని గురువారం తిరిగి కొనుగోలు చేసి, సాయంత్రం పాఠశాలలో ఏర్పాటు చేయించినట్లు తెలిసింది.

- హిందూపురం అర్బన్



ఖాళీగా ఉన్న కంప్యూటర్ గది



- హెచ్‌ఎం ఏకపక్ష నిర్ణయం
- పాఠశాల కమిటీ తీర్మానం లేకుండానే విక్రయం..
- మూడేనంటూ బుకాయింపు..!
- బయటకు పొక్కడంతో కొన్ని తిరిగి కొనుగోలు?




ఆటోలో తరలిస్తున్న వస్తువులు

టీడీపీ హయాంలో కేటాయింపు

ఎంజీఎం పాఠశాలలో దాదాపు 850 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. టీడీపీ హయాంలో కార్పొరేట్ విద్యాలయాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను నిర్వహించాలని సంకల్పించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించేందుకు కంప్యూటర్లను అందించింది. అప్పట్లో 15 నుంచి 20 కంప్యూటర్లు ఏర్పాటు చేసినట్లు సమాచారం. ఒక జనరేటర్ కూడా ఇచ్చారు. విద్యార్థులకు కంప్యూటర్ శిక్షణ ఇచ్చేందుకు నిపుణులను సైతం నియమించారు. వారి కాంట్రాక్టు గడువు ముగియడంతో వారు వెళ్లిపోయారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక కంప్యూటర్ విద్యను అటకెక్కించారు. దీంతో ఎంజీఎం పాఠశాలలో కంప్యూటర్లు మూలనపడ్డాయి. వాటిపై పాఠశాల హెచ్‌ఎం సామ్రాజ్యం కన్నుపడింది. వారంరోజుల క్రితం కంప్యూటర్ల, వాటి సామగ్రిని గుజిరీకి అమ్మేశారు. పాఠశాలకు సంబంధించి ఏదైనా పాతబడిన వస్తువు విక్రయించాలన్నా, కొనాలన్నా ముందుగా స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశంలో తీర్మానించాల్సి ఉంటుంది. ఆ మేరకే నిర్ణయం తీసుకోవాలి. అదికూడా ముందుగా కొటేషన్లు తీసుకోవాలి. అందులో ఎవరు ఎక్కువ మొత్తంలో కొటేషన్ ఇస్తారో వారికి వస్తువులను విక్రయించాలి. తద్వారా వచ్చిన సొమ్ముకు రశీదు ఇచ్చి, వాటిని రికార్డుల్లో కనబరచాలి. ఆ మొత్తాన్ని పాఠశాల అకౌంట్‌లోగానీ, ప్రభుత్వ అకౌంట్‌లోగానీ జమచేయాలి. ఇవేవీ చేయకుండా హెచ్‌ఎం ఏకపక్షంగా కంప్యూటర్ (డెస్క్‌టాప్, కీబోర్డు, సీపీయూ)లను విక్రయించారు. తద్వారా వచ్చిన సొమ్మును పాఠశాల అకౌంట్‌లో అయినా జమ చేశారా అంటే అదీ లేదు. ఆ సొమ్ము ఏమైందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మూలనపడిన, ఎందుకూ పనికిరాని మూడు కంప్యూటర్లు, కీ బోర్డులను మాత్రమే విక్రయించాననీ, తద్వారా రూ.1500 మాత్రమే వచ్చిందని హెచ్‌ఎం సెలవిస్తున్నారు. టీడీపీ హయాంలో 20 కంప్యూటర్ల దాకా ఇచ్చినట్లు తెలుస్తోంది. హెచ్‌ఎం మాత్రం తాను బాధ్యతలు తీసుకునే నాటికి మూడు కంప్యూటర్లు మాత్రమే ఉన్నాయని చెప్పుకొస్తున్నారు. తాను బాధ్యత తీసుకునేటపుడు ఎన్ని ఉన్నాయో చూసుకోలేదని చెప్పడం అనుమానాలకు తావిస్తోంది. విషయం గురువారం వెలుగులోకి రావడంతో గుజిరీ వ్యాపారికి ఫోన్ చేసి, కంప్యూటర్లు, సామగ్రిని వెనక్కి తీసుకురమ్మని చెప్పినట్లు తెలిసింది. ఆ మేరకు మూడింటిని మాత్రం తీసుకొచ్చి, సాయంత్రం పాఠశాలలో ఏర్పాటు చేసినట్లు సమాచారం. కంప్యూటర్లు విక్రయించడంలో ఒకరిద్దరు ఉపాధ్యాయులు.. హెచ్‌ఎంకి సహకరించారని తెలుస్తోంది.

జిల్లా అధికారులపై అనుమానాలు




అవినీతి ఆరోపణలతో సస్పెండైన ఉద్యోగిని మళ్లీ అదే పాఠశాలలో నియమించడంపై తీవ్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంలో జిల్లాస్థాయి అధికారికి పెద్దఎత్తున ముడుపులు ముట్టినట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఉన్నతాధికారుల అండ ఉండడంతోనే హెచ్‌ఎం ఇష్టారాజ్యంగా నిర్ణయాలు తీసుకుంటూ.. కంప్యూటర్లను అమ్మేశారని పాఠశాలలో చర్చ సాగుతోంది.

ఎంజీఎం పాఠశాల హెచ్‌ఎంపై గతంలోనూ అవినీతి ఆరోపణలు వచ్చాయి. విద్యార్థులకు టీసీలు ఇచ్చేందుకు, ఫీజులు సైతం అధిక మొత్తంలో వసూలు చేసినట్లు గతంలో విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదులు అందాయి. ఈ విషయంపై పెనుకొండ డీవైఈఓ రంగ

సస్పెండైన స్కూల్‌లోనే పోస్టింగ్..!

స్వామి అప్పట్లో 534 మంది విద్యార్థులను విచారించారు. నివేదికను ఉన్నతాధికారులకు అందించారు. ఆరోపణలు వాస్తవమని తేలడంతో హెచ్‌ఎంను గతేడాది జూన్‌లో సస్పెండ్ చేశారు. కొన్నాళ్లకే సస్పెండైన స్కూల్‌లోనే మళ్లీ హెచ్‌ఎంగా ఆమెకు పోస్టింగ్ ఇచ్చారు. ఈ వ్యవహారంలో జిల్లా స్థాయి అధికారికి పెద్దఎత్తున సొమ్ము ముట్టజెప్పారన్న ఆరోపణలున్నాయి. అలా పోగొట్టుకున్న సొమ్ము ఈ పాఠశాలలోనే సంపాదించుకోవాలని ఆమె సన్నిహితుల వద్ద అన్నట్లు సర్వత్రా చర్చ సాగుతోంది.



ఎంజీఎం పాఠశాల

మూడు డెస్క్‌టాప్‌లు, కీ బోర్డులు మాత్రమే: సామ్రాజ్యం, హెచ్‌ఎం, ఎంజీఎం పాఠశాల

పాఠశాలలో నేను విక్రయించింది మూడు పాతబడిన, పనికిరాని కీబోర్డులు, డెస్క్‌టాప్‌లు మాత్రమే. వాటిని రూ.1500కే అమ్మేశా. పాఠశాల యాజమాన్య కమిటీకి చెప్పలేదు. చిన్న వస్తువులే కదా అనుకున్నా.

శ్రీవారిని దర్శించుకున్న ఎస్పీ

కదిరి, మార్చి 21: పట్టణంలో వెలసిన శ్రీఖాద్రీల క్ష్మీనరసింహస్వామిని జిల్లా ఎస్పీ మాధవరెడ్డి గురువారం కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. ఎస్పీకి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. స్వామి వారి చిత్రపటంతో సత్కరించారు. అనంతరం పోలీసు అధికారులతో ఎస్పీ సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. బ్రహోత్సవాల్లో పటిష్ఠ భద్రత ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎస్పీ వెంట డీఎస్పీ శ్రీలత, సీఐలు పుల్లయ్య, వెంకటేశ్వర్లు, మోహన్ పాల్గొన్నారు.



ఎస్పీకి స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ సిబ్బంది

కోడ్ అమలు ప్రకటనలకే పరిమితమా..?

వైసీపీ అభ్యర్థుల తరపున వలంటీర్లు, డీలర్లు, ఐకేపీ సిబ్బంది అడ్డగోలుగా ప్రచారం

ఉన్నతాధికారుల మౌనంపై విమర్శలు

అనంతపురం టౌన్, మార్చి 21: జిల్లాలో ఎన్నికల కోడ్ అమలు కేవలం ప్రకటనలకే పరిమితమా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కోడ్ అమలుకు అది చేపట్టాం.. ఇది చేస్తున్నాం.. ఎక్కడా నిర్లక్ష్యం చేయం.. ఎవరైనా కోడ్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు అంటూ నిత్యం ఉన్నతాధికారులు, ఎన్నికల నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్లు గొప్పగా చెబుతున్నారు. కోడ్ అమలుకు ప్రత్యేక టీంలను ఏర్పాటుచేశారు. కలెక్టరేట్‌లో జిల్లాస్థాయి కమాండ్ కంట్రోల్ రూం ఏర్పాటు చేసి పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమించారు. అయినా వలంటీర్లు బరితెగించి వైసీపీ నాయకుల తరఫున ప్రచారంలో పాల్గొంటున్నారు. ప్రభుత్వం నుంచి గౌరవ వేతనం పొందుతున్నారు కాబట్టి వలంటీర్లు, డీలర్లు, యానిమేటర్లు ఎన్నికల నిబంధనల కిందకు వస్తారని, వారు ఎన్నికల ప్రచారంలో పాల్గొనకూడదని, ప్రచారం చేస్తే చర్యలు తీసుకోవాలని అధికారికంగా ప్రకటించారు. మరోవైపు ఎన్నికల్లో ఏజెంట్లుగా కూర్చోవడానికి లేదని తెలిపింది. అయినా వలంటీర్లకు ముకుతాడు వేసేవారే కరువయ్యారు. వారి ఆగడాలకు హద్దూ అదుపు లేకుండా పోయిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

● శింగనమల మండలం రాచేపల్లి పంచాయతీ కార్యదర్శి (బీఎల్‌ఓ) డొక్క క్రిష్ణ వైసీపీ నాయకుల ప్రచారంలో పాల్గొన్నారు. ఆధారాలతో బయటపడగా ఎంపీడీఓ కేవలం నోటీస్ ఇచ్చి చేతులు దులుపుకున్నారు. సంబంధిత ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎలాంటి చర్యలు తీసుకోలేదు.

● బొమ్మనహాల్ మండల పరిధిలోని దేవగిరి, హరేసముద్రం గ్రామాల్లో వైసీపీ పార్టీ అభ్యర్థి, ఆ పార్టీ నాయకులతో వలంటీర్లు రాముడు, వన్నూరుస్వామి, నాగరాజు, ఐకేపీ యానిమేటరు నాగరాజు ప్రచారంలో పాల్గొన్నారు.

● శింగనమల మండలం జలాలపురం గ్రామానికి చెందిన వలంటీరు వెంకటేష్ వైసీపీ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఆధారాలతో పత్రికల్లో కూడా ప్రచురితమైంది. అయితే అధికారులు ఏమాత్రం చర్యలు తీసుకోలేదు.

ఎవరినీ ఉపేక్షించం

ఎన్నికల నిబంధనల అమలులో ఎక్కడా రాజీపడం. ఉల్లంఘించిన వారిని ఉపేక్షించం. వలంటీర్లు, డీలర్లు, ఐకేపీ, డ్వామా సిబ్బందితోపాటు ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు, కాంట్రాక్ట్ ఉద్యోగులు కోడ్ కిందకు వస్తారు. వారు రాజకీయ కార్యక్రమాల్లో, ప్రచారాల్లో పాల్గొనకూడదు. పాల్గొంటే అలాంటివారిపై తప్పకుండా చర్యలు తీసుకుంటాం. నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులకు పూర్తి అధికారాలు ఇచ్చాం. ఇప్పటికే కొందరు వలంటీర్లు, డీలర్లపై చర్యలు తీసుకోవడం జరిగింది. ఎవరు ఎలాంటి అనుమానాలు పెట్టుకోవాల్సిన అవసరంలేదు. ఆధారాలతో ఫిర్యాదులొస్తే చర్యలు తప్పవు.

- కలెక్టర్ గౌతమి



● గుమ్మఘట్ట మండలంలో వలంటీరు హనుమంతు వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటూ అడ్డంగా దొరికారు. అయినా ఎటువంటి చర్యలు తీసుకోలేదు.

ఇవి కేవలం మచ్చుకు మాత్రమే. జిల్లాలోని ఏ నియోజకవర్గంలోని ఏ గ్రామంలో చూసినా ఇలాంటి దృశ్యాలే కనిపిస్తున్నాయి. 123, 129., 134(ఏ) ప్రకారం కోడ్ ఉల్లంఘన కిందకు వస్తుంది. అవసరమైతే ఐపీసీ171 సెక్షన్ కింద కేసుకూడా నమోదు చేయవచ్చని చెబుతున్నారు.

మౌనమేల..?

జిల్లాలో యథేచ్ఛగా ఎన్నికల కోడ్ ఉల్లంఘన చేస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఉన్నతాధికారులు మౌనంగా ఉంటుండడంపై పార్టీలు, ప్రజల నుంచి విమర్శలు వినిపిస్తున్నాయి. వలంటీర్ల ప్రచారాలకు సంబంధించి ఆధారాలతో బయటపెడుతున్నా ఎందుకు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని ప్రశ్నిస్తున్నారు.

యథేచ్ఛగా ఉల్లంఘన



అనంతపురం రహదారిలో విద్యుత్‌స్తంభానికి కాంగ్రెస్‌పార్టీ జెండా

ఉరవకొండ: ఎన్నికల నియమావళిలో భాగంగా రాజకీయ పార్టీలకు సంబంధించిన జెండాలు, హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలను తొలగించాలన్న ఆదేశాలు ఉన్నా అవి అమలు కావడం లేదు. అనంతపురం-బళ్లారి జాతీయరహదారిపై హంద్రీనీవా కాలువ వద్ద పార్టీల జెండాలు అలాగే దర్శనమిస్తున్నాయి. వజ్రకరూరు మండలంలోని చాబాలలో అంగన్‌వాడీ సెంటర్‌లో వైఎస్సార్ సంపూర్ణపోషణ కింద పంపిణీ చేసిన పాల ప్యాకెట్లను జగన్‌ఫొటోలతోనే అందజేశారు. ఫొటోలను కనిపించకుండా చేసి పంపిణీ చేయాలని సూచించినా అదేవిధంగా వాటిని అందజేయడం గమనార్హం.



జగన్ ఫొటో ఉన్న పాలప్యాకెట్లు

డీలర్ ప్రచారం



వైసీపీ శింగనమల అభ్యర్థి వీరాంజినేయులుకు మద్దతుగా ప్రచారం చేస్తున్న డీలర్ భాస్కర్

బుక్కరాయసముద్రం: శింగనమల నియోజకవర్గం వైసీపీ అభ్యర్థి వీరాంజినేయులుకు మద్దతుగా మండల పరిధిలోని పి కొత్తపల్లి గ్రామం చౌకధాన్యపు డీలర్ భాస్కర్ గురువారం ప్రచారం చేపట్టాడు. బుక్కరాయసముద్రం పంచాయతీలోని పలుకాలనీల్లో వైసీపీ చేపట్టిన ప్రచారంలో డీలర్ల సంఘం ఉపాధ్యక్షుడు భాస్కర్ ప్రచారం చేశాడు. ఎన్నికల సంఘం ఆదేశించినా నియమావళిని లెక్కచేయకుండా మండలంలో స్టోర్ డీలర్లు యథేచ్ఛగా వైసీపీ అభ్యర్థి తరుపున ప్రచారం చేస్తున్నారు. అయినా రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు.

తగ్గని వలంటీర్లు..!

వైసీపీ తరపున ప్రచారం...

విధుల నుంచి పలువురి తొలగింపు

అనంతపురం క్రైం/అర్బన్/కొత్తచెరువు/ఓబుళదేవరచెరువు, మార్చి 21: ఎన్నికల కమిషన్ ఆదేశాలు వలంటీర్ల చెవికెక్కినట్లు కనిపించడం లేదు. వారిపై అధికారులు చర్యలు తీసుకుంటున్నా వైసీపీ ప్రచారంలో పాల్గొనడానికి ఏమాత్రం వెనుకాడటం లేదు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో అధికార పార్టీకి అనుకూలంగా వలంటీర్ల ప్రచారాలు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో గురువారం కూడా పలువురిపై అధికారులు చర్యలు తీసుకున్నారు.

● అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో ఎమ్మెల్యే అనంతవెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటికీ వైసీపీ పేరుతో ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రతి రోజూ సంబంధిత డివిజన్ల పరిధిలో వలంటీర్లు ప్రచారాల్లో పాల్గొంటున్నారు. అనంతపురం నగరంలోని 27, 28 డివిజన్‌లలో గురువారం నిర్వహించిన ప్రచారంలో వలంటీర్లు మున్ని, బంగి వనజ, సుమతి, విజయకుమారి, అలేఖ్య, కప్పల విజయ, చంద్రకళ, పార్వతి, వలి, చలమల శిరీష, షేక్ షబానాజ్మీ, ఇండ్ల అజయ్ జాసన్, సుకన్య అన్నపూర్ణ, శబనాజ్, సుజాత, కుళ్లాయమ్మ, అబ్బాస్ పాల్గొన్నారు. దీంతో వైసీపీ ఎన్నికల ప్రచారానికి హాజరైన వలంటీర్లపై చర్యలు తీసుకోవాలని అనంతపురం ఆర్డీఓ వెంకటేష్‌కు టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. టీడీపీ నాయకులు ముక్తియార్, గోపాల్‌గౌడ్, వన్నూరప్ప, బోయపాటి బాలప్ప, శ్రీకాంత్, చెరుకుతోట పవన్‌కుమార్ ఆర్డీఓను కలిసి ఆధారాలతో ఫిర్యాదు చేశారు.

● శ్రీ సత్యసాయి జిల్లా ఓబుళదేవరచెరువు మండలంలోని తుమ్మలకుంట్లపల్లిలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వలంటీర్లు ఆదినారాయణ, నరసింహులును అధికారులు విధుల నుంచి తొలగించారు. మరో ఇద్దరికి ఎంపీడీఓ వరలక్ష్మి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. కొత్తచెరువు మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన వైసీపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న వలంటీర్లు గోరంట్లపల్లి హర్షద్, సాయి ప్రకాష్‌ను విధుల నుంచి తొలగించామని ఇన్‌చార్జి ఎంపీడీఓ సిద్దారెడ్డి గురువారం తెలిపారు. ఈ రెండు మండలాల్లో వలంటీర్ల ఎన్నికల ప్రచారంపై ఆంధ్రజ్యోతిలో కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో అధికారులు స్పందించారు.

● తాడిపత్రి పట్టణంలో వలంటీర్లుగా పనిచేస్తున్న అమూల్య, నాగసులోచన, మల్లేశ్వరరెడ్డి, దాదాపీరాలను ఎన్నికల కమిషన్ విధుల నుంచి తొలగించింది. పట్టణంలోని శ్రీనివాసపురం, సంజీవనగర్ ప్రాంతాల్లో వీరు ఓటర్ వెరిఫికేషన్ చేస్తుండటంతో కోడ్ ఉల్లంఘించారని పలువురు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదుచేశారు. విచారించిన ఆర్‌ఓ రాంభూపాల్‌రెడ్డి నివేదికను ఎన్నికల కమిషన్‌కు పంపగా కమిషన్ ఆదేశాల మేరకు గురువారం వారిని విధుల నుంచి తొలగించారు.



ఎమ్మెల్యే పక్కన వలంటీర్ అబ్బాస్



ప్రచారంలో వలంటీర్ కుళ్లాయమ్మ



ఆర్‌డీఓకు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నాయకులు



అనంత అర్బన్‌లో వైసీపీ తరపున ప్రచారం చేస్తున్న వలంటీర్లు

ఉంతకల్లులో అమలు కాని ఎన్నికల కోడ్



విలేజ్ క్లినిక్‌కు వైఎస్సార్ పేరు కనిపిస్తున్న దృశ్యం

బొమ్మనహాళ్: ఎన్నికల నియమావళిని కొందరు అధికారులు బేఖాతరు చేస్తున్నారు. పలు గ్రామాల్లో శిలాఫలకాలు, రైతుభరోసా, విలేజ్ క్లీనిక్, పాలడైరీలకు వైసీపీ నేతల పేర్లు దర్శనమిస్తున్నాయి. మండలంలోని ఉంతకల్లు గ్రామంలో రైతుభరోసా, ఆర్బీకేకు వైఎస్సార్ పేరు అలాగే ఉంది. జగనన్న పాలవెల్లువ మహిళా డైరీ సహకార సంఘం అని అలానే ఉంచారు. వైఎస్సార్ విలేజ్ క్లీనిక్ కూడా అలాగే ఉంచారు. ఇటీవల ప్రారంభించిన శిలాఫలకం కూడా అలాగే దర్శనమిస్తోంది. గ్రామంలో ఎన్నికల కోడ్ అమలు కావడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సచివాలయ భవనానికి జగన్ ఫోటో కనిపించకుండా స్టిక్కర్ మాత్రమే వేసి సంక్షేమ పథకాలు కనిపించేలా వదిలేశారు. వాటిని తొలగించాల్సి ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో వైసీపీ అభ్యర్థి మెట్టు గోవిందరెడ్డి సొంత గ్రామమైన ఉంతకల్లులో ఎన్నికల కోడ్ అమలులోకి రాదా అని కొందరు ప్రశ్నిస్తున్నారు.



క్లినిక్ వద్ద శిలాఫలకం



జగన్ పేరు..

స్మార్ట్ మీటర్లపై జగనన్న బొమ్మ

ధర్మవరం రూరల్: మండలవ్యాప్తంగా రైతులకు సంబంధించిన మోటర్లకు స్మార్ట్‌మీటర్లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ మీటర్లుకు జగనన్న బొమ్మతో కూడిన నవరత్నాల స్టిక్కర్లు అతికించారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో మీటర్లకు జగనన్న స్టిక్కర్లు ఉండటంతో పలువురు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. వీటికి ఎన్నికల కోడ్ వర్తించదా అని ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి ఎన్నికల కోడ్ అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



వైసీపీ ఆత్మీయ సమావేశంలో వలంటీర్

కణేకల్లు: మండల కేంద్రంలో గురువారం జరిగిన వైసీపీ ఆత్మీయ సమావేశంలో రామ్‌నగర్‌కు చెందిన వలంటీర్ గంగాధర్ పాల్గొన్నారు. స్థానిక వైసీపీ కార్యాలయం వద్ద ఆత్మీయ సమావేశం నిర్వహించగా వలంటీర్ పాల్గొనడం విమర్శలకు తావిస్తోంది. కొంతమంది స్టోర్‌డీలర్లు, యానిమేటర్ల భర్తలు, వలంటీర్ల భర్తలు సమావేశంలో పాల్గొన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలు స్పష్టంగా ఉన్నా వలంటీర్లు ఏమాత్రం తగ్గకుండా వైసీపీ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు.



సమావేశంలో పాల్గొన్న వలంటీర్

ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న బొలెరో

తండ్రి మృతి... ఇద్దరు కుమారులకు తీవ్రగాయాలు



బోల్తాపడ్డ బొలెరో వాహనం



గోపాల్ (ఫైల్)

కళ్యాణదుర్గంరూరల్, మార్చి 21: అతివేగంతో వస్తున్న బొలెరో ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా ఇద్దరు గాయపడ్డారు. గురువారం పట్టణంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద ఈ ఘటన చోటుచేసుకుంది. కంబదూరు మండలం ఎగువపల్లికి చెందిన గొల్ల గోపాల్ (44) పొట్టకూటి కోసం పట్టణానికి 20 సంవత్సరాల క్రితం వచ్చాడు. టైలర్‌గా జీవనం సాగిస్తూ స్థిరపడ్డాడు. పార్వతినగర్‌లో మూడు సంవత్సరాల క్రితం ఇంటిని నిర్మించుకుని నివాసం వుంటున్నాడు. గోపాల్ కుమారులు తరుణ్ పదవ తరగతి చదువుతుండగా తేజేశ్వర్ నాలుగవ తరగతి చదువుతున్నాడు. గురువారం కుమారులను స్కూలుకు ద్విచక్రవాహనంలో తీసుకెళ్తుండగా అనంతపురం నుంచి పైపులతో వస్తున్న బొలెరో ఢీకొంది. దీంతో గోపాల్ అక్కడికక్కడే మృతి చెందగా అతడి కుమారులు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే వారిని చికిత్స నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

654 లైసెన్స్‌డ్ ఆయుధాలు డిపాజిట్

- ఎస్పీ అన్బురాజన్

అనంతపురం క్రైం, మార్చి 21: జిల్లాలో ఇప్పటివరకు 654 లైసెన్స్ ఆయుధాలు డిపాజిట్ చేయించామని ఎస్పీ అన్బురాజన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 703 లైసెన్స్ హోల్డర్లు ఉన్నారన్నారు. ఎన్నికల వేళ పోలీస్‌స్టేషన్ స్థాయిలో ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపి జిల్లాలో ఇప్పటివరకు 654 లైసెన్స్ ఆయుధాలు డిపాజిట్ చేయించామన్నారు. ఇంకా 80 ఆయుధాలు డిపాజిట్ చేయాల్సి ఉందన్నారు. ఇందులో 77 ఆయుధాలు బ్యాంకుల సెక్యూరిటీ సిబ్బందితో ఉన్నాయన్నారు. మిగతా 3 ఆయుధాలు కలిగిన వారు వేరే రాష్ట్రాలలో ఉన్నట్లు గుర్తించామని, వారికి సైతం త్వరగా డిపాజిట్ చేయాలని సూచించామన్నారు. ఎన్నికల వేళ ఎవరైనా ప్రలోభపెట్టినా, ఓటర్లకు, రాజకీయ పార్టీల నాయకులకు భద్రతా పరమైన సమస్యలున్నా, అనధికారికంగా ఎవరైనా ఆయుధాలు కలిగి ఉన్నట్లు తెలిసినా వెంటనే తన ఫోన్ నెంబర్ 9440796800కు లేదా జిల్లా స్పెషల్ బ్రాంచి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక విభాగం నెంబర్ 9392918293కు సమాచారం చేరవేయాలన్నారు. వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

హంస వాహనంపై విహరించిన ఖాద్రీశుడు



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు



స్వామివారికి హారతి ఇస్తున్న అర్చకులు

కదిరి, మార్చి 21: బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామివారు హంసవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నిత్యపూజ, హోమం, అనంతరం శ్రీవారిని తిరుమాడవీధుల్లో ఊరేగించారు. సంధ్యా సమయంలో శ్రీవారు హంసవాహనంపై విహరించారు. కల్యాణోత్సవ తదుపరి రోజు శ్రీవారు తిరువీధుల్లో విహరించడానికి హంసను నారసింహుడి వాహనంగా బ్రహ్మదేవుడు పంపుతారని భక్తుల నమ్మకం. హంస పాలను నీటిని ఎలా వేరు చేస్తుందో అదేవిధంగా నారసింహుడు భక్తుల్లోని మంచి చెడులను వేరు చేసి మంచిని మాత్రమే స్వీకరిస్తారని విశ్వాసం. హంసవాహనంపై విహరిస్తున్న శ్రీవారిని దర్శించుకోవడానికి పట్టణం నుండే కాకుండా వివిధ గ్రామాల నుంచి భక్తులు విచ్చేశారు. ఉత్సవానికి ఉభయదారులుగా తోటంశెట్టి రాజగోపాల్‌శెట్టి కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఉత్సవంలో ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డితోపాటు ఆలయ ధర్మకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

నేడు సింహ వాహన సేవ

ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి వారు సింహవాహనంపై తిరువీధుల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం క్లాక్‌టవర్, మార్చి 21: వేసవి క్రీడ శిక్షణ శిబిరాల నిర్వహణకు ఆసక్తి ఉన్న కోచ్‌లు, పీఈటీలు, సీనియర్ క్రీడాకారులు, సర్టిఫికెట్ కోర్సు చేసిన వారు ఈనెల 31వతేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని డీఎస్‌డీఓ షఫీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 1వతేదీ నుంచి 31వతేదీ వరకు జిల్లావ్యాప్తంగా 50 సమ్మర్ కోచింగ్ క్యాంపుల నిర్వహణ జరుగుతుందని, ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు పూర్తి వివరాలతో అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో అందజేయాలన్నారు. వివరాలకు ఫోన్ నంబరు 08554-353223ను సంప్రదించాలని కోరారు.

వైసీపీ నాయకుడి ట్రాక్టర్ సీజ్

డీ.హీరేహాళ్, మార్చి 21: అక్రమంగా ఇసుక తరలిస్తున్న వైసీపీ నాయకుడి ట్రాక్టర్‌ను పోలీసులు గురువారం సీజ్ చేశారు. మండలంలోని హిర్దేహాళ్ గ్రామానికి చెందిన వైసీపీ నాయకుడు శ్రీకాంత్ తన ట్రాక్టర్‌తో గ్రామ పరిసర ప్రాంతాలలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. వెంటనే వారు అక్కడికి వెళ్లి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. కేసు నమోదు చేశామని, నివేదికను తహశీల్దార్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు.

పురం ఎంపీ అభ్యర్థిగా బీకే?

నేడు ప్రకటించే అవకాశం



పుట్టపర్తి, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి హిందూపురం ఎంపీ అభ్యర్థిపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడినట్లు తెలిసింది. టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి పేరు ఖరారు చేసినట్లు ఆ పార్టీ వర్గాల సమాచారం. పెనుకొండ మాజీ ఎమ్మెల్యే అయిన ఆయన మరోసారి అసెంబ్లీకి పోటీ చేయాలని ప్రయత్నించారు. అక్కడ సవితను ప్రకటించారు. టీడీపీ సీనియర్ నాయకుడు, పార్లమెంటు నియోజకవర్గ పరిధిలో అన్నివర్గాలను కలుపుకొనిపోయే వ్యక్తిగా ఆయనకు పేరుంది. దీంతో పార్టీ అధిష్టానం ఆయనను ఎంపీ అభ్యర్థిగా ఖరారు చేసినట్లు తెలిసింది. ఇప్పటికే ఎమ్మెల్యే అభ్యర్థుల పేర్లు ప్రకటించగా, శుక్రవారం ఎంపీ అభ్యర్థుల జాబితా చంద్ర బాబు విడుదల చేయనున్నారు. ఈ జాబితాలో బీకే పార్థసారథి పేరును వెల్లడించనున్నట్లు సమాచారం. కొన్ని రోజులుగా హిందూపురం ఎంపీ అభ్యర్థిత్వంపై ఉత్కంఠం నెలకొంది. పొత్తులో భాగంగా బీజేపీకి కేటాయిస్తారన్న ఊహాగానాలు వెలువడ్డాయి. ఆ పార్టీకి చెందిన ఒకరిద్దరు హిందూపురంలో కొన్ని కార్యక్రమాలు కూడా చేశారు. ఆఖరుకు టీడీపీకే ఎంపీ స్థానం కేటాయించడంతో ఉత్కంఠకు తెరపడినట్లయింది. బీకే పార్థసారథిని ఖరారు చేయనున్నట్లు రెండ్రోజుల క్రితమే మీడియాలో రావడంతో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున సంబరాలు చేసుకున్నారు.

'రబీ పంటనష్టంపై సమగ్ర నివేదికలు పంపండి'

అనంతపురం అర్బన్, మార్చి 21: 2023-24 రబీ సీజన్‌లో మెట్టపొలాల్లో పంటనష్టంపై సమగ్ర నివేదికలు పంపాలని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ ఆదేశించారు. గురువారం ఏడీఏలు, ఏఓలతో ఆమె టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. రబీ సీజన్‌లో జిల్లాలోని 14 మండలాల్లో కరువు ఏర్పడినట్లు ప్రభుత్వం గుర్తించిందన్నారు. ఆయా మండలాల్లో రైతుల వారిగా పంటనష్టం నివేదికలు పంపాలన్నారు.

ఏప్రిల్ 1 నుంచి విలేజ్ పశుసంవర్ధక సహాయకులకు శిక్షణ

అనంతపురం అర్బన్, మార్చి 21: జిల్లాలో కొత్తగా ఉద్యోగం చేరిన విలేజ్ పశుసంవర్ధక సహాయకులకు ఏప్రిల్ 1వతేదీ నుంచి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని పశుసంవర్ధక శాఖ జేడీ సుబ్రహ్మణ్యం గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రెడ్డిపల్లి ప్రాంతీయ పశుశిక్షణ కేంద్రం, జేడీ ఆఫీస్, సాయి నగర్ వెటర్నరీ ఆస్పత్రి, సిద్దరాంపురం పశుగ్రాస కేంద్రంలో 457 మంది సిబ్బందికి ఆరు బ్యాచులుగా విభజించి, 45 రోజుల పాటు శిక్షణనిస్తామన్నారు.

రేపు ప్రవీణ్ ప్రకాశ్ రాక

అనంతపురం విద్య, మార్చి 21: విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ ఉమ్మడి జిల్లా పర్యటనకు శనివారం వస్తారని తెలిసింది. జిల్లాలో 13 మంది అంధ విద్యార్థులు పదో తరగతి పరీక్షలను రాస్తున్నారు. గతానికి భిన్నంగా, ఎవరి సాయం లేకుండా కంప్యూటర్లు, ల్యాప్‌టాప్స్‌పై వీరు పరీక్షలు రాస్తున్న తీరును ఆయన పరిశీలిస్తారని సమాచారం. కంప్యూటర్లు లేదా ల్యాప్‌టాప్స్ ద్వారా పరీక్షలు రాసేందుకు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ దేవానందరెడ్డి వీరికి అనుమతి ఇచ్చారు. గత ఏడాది కూడా ఆరుగురు అంధ విద్యార్థులు ఇలాగే పరీక్షలు రాశారు. ఈ ఏడాది నాగరాజుగారి సుమ, సజ్జల దిలీప్, పఠాన్ మదిహా, బెస్త మేఘన, అరవ రవి ఈశ్వర్, చల్లా నిర్మల, కురుబ దీపిక, వడ్డే నవీన్‌కుమార్, జొహరాపురం సాయినాథ్, కట్టుబడి మల్లిక, గట్ల శ్రావణి, అనుబోలు గురుస్వామి, రామన్నగారి భార్గవి డిజిటల్ పరికరాలతో పరీక్షలు రాస్తున్నారు.



సబ్బనగుంతపల్లిలో టీడీపీలోకి చేరినవారితో కందికుంట

టీడీపీలోకి భారీగా చేరికలు

తనకల్లు, మార్చి 21: మండలంలోని దేవళంతండా, కోటపల్లి, మరాలపల్లి, కొక్కంటిక్రాస్ గ్రామాలకు చెందిన సుమారు 30 కుటుంబాల వారు గురువారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. కోటపల్లి సింగల్ విండో మాజీ అధ్య క్షుడు బాగేపల్లి చలపతి, టీడీపీ మండల కన్వీనర్ రెడ్డిశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో వారు తలుపుల మండలంలోని సబ్బనగుంతపల్లిలో టీడీపీలో చేరారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంట వెంకటప్రసాద్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పార్టీలో చేరినవారిని తన కుటుంబ సభ్యులుగా చూసుకుంటానన్నారు. ఇంకో 55రోజుల్లో వైసీపీ ప్రభుత్వాన్ని సాగనంపుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు శంకర్‌రెడ్డి, రెడ్డెప్ప, హరిలాల్‌నాయక్, గంగాధర్, మహేష్, బాబు, శ్రీనాథ్, బషీర్, మధు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కదిరి: కదిరి మండలం చలమకుంటపల్లి పంచాయతీలోని పలుగ్రామాలకు చెందిన 30 కుటుంబాల వారు గురువారం రాత్రి వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. పట్టణంలోని కందికుంట నివాసంలో వారందరూ టీడీపీలోకి చేరారు. నియోజకవర్గ ఇన్‌చార్జి కందికుంటవెంకట ప్రసాద్ వీరందరికి కండువాలు వేసి పార్టీలో ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో ఓబుల రెడ్డి, ఆనంద్‌రెడ్డి, వెంకటరెడ్డి, నూర్‌ఖాన్, భానుప్రకాష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



టీడీపీలోకి చేరిన చలమకుంటపల్లి వాసులతో కందికుంట

పేదింటి యువతికి ఉద్యోగాల పంట



తల్లిదండ్రులతో లహరి

ముదిగుబ్బ, మార్చి 21: పేదింటి యువతికి ఉద్యోగాలు పంట పండింది. మండల కేంద్రానికి చెందిన గురుప్రసాద్, నాగరత్న కుమార్తె లహరి బుధవారం రాత్రి విడుదలైన ఫలితాల్లో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్‌గా ఎంపికైంది. అయితే డిసెంబర్‌లో విడుదలైన ఎస్‌ఐ ఫలితాల్లో లహరి ఉత్తీర్ణత సాధించి అనంతపురంలో ప్రస్తుతం శిక్షణ పొందుతోంది. ఇప్పుడు మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్‌గా ఎంపిక కావడంతో కుటుంబ సభ్యులు, స్థానికులు పలువురు ఆమెను అభినందించారు.

ఎరువుల దుకాణాల తనిఖీ

ముదిగుబ్బ, మార్చి21: మండలకేంద్రంలోని ఎరువుల దుకాణాలను గుంటూరు వ్యవసాయ కమిషన్ కార్యాలయ సిబ్బంది గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి లైసెన్స్‌లు, రికార్డులు పరిశీలించారు. ఎరువులు, విత్తనాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని దుకాణాల యజమానులకు ఆదేశించారు. కార్యక్రమంలో రైతుభరోసా కేంద్రాల ఏడీఏ శ్రీనివాసాచార్యులు, రైతుభరోసా కేంద్రాల ఏఓ శివరామకృష్ణ, కదిరి ఏడీఏ సత్యనారాయణ, మండల వ్యవసాయ అధికారి లక్ష్మీనరసింహులు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

టిప్పర్ కింద పడి వ్యక్తి మృతి

కదిరి, మార్చి 21: మున్సిపాలిటీ పరిధిలోని కుటాగుళ్ల వద్ద బ్రిడ్జి సమీపంలో ఓ వ్యక్తి టిప్పర్ కింద పడి మృతిచెందినట్లు ఎస్ఐ బాబ్‌జాన్ తెలిపారు. ఆయన తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. తెలంగాణ రాష్ట్రం వనపర్తి జిల్లా చింతకుంట గ్రామానికి చెందిన మద్దిలేటి (31), అతని భార్య గాయత్రి కూలీ పనులు చేయడానికి కదిరికి వచ్చారు. కాగా బుధవారం రాత్రి టిప్పర్ డ్రైవర్ నాగరాజు బ్రిడ్జి సమీపంలో టిప్పర్‌ను రివర్స్ చేస్తూ.. వెనుక ఉన్న మద్దిలేటిని గమనించకుండా వేగంగా అలాగే పోనిచ్చాడు. దీంతో మద్దిలేటి వెనక చక్రాల కింద పడి అక్కడిక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కదిరిప్రభుత్వాస్పత్రికి తరలించామన్నారు. మృతునికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

నిందితులకు రిమాండ్

నల్లమాడ, మార్చి 21: ఘర్షణ విషయంలో ఓ వ్యక్తి మృతి చెందగా, నిందితులకు రిమాండ్ విధించినట్లు సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్ పేర్కొన్నారు. గురువారం ఆయన తెలిపిన వివరాల మేరకు ఈ నెల 15న మండలంలోని సోముగుట్టపల్లికిచెందిన సోముగుట్ట అంజన్‌రెడ్డితో అదే గ్రామానికి చెందిన రంగారెడ్డి, నాగేంద్రరెడ్డి, పూజిత ఘర్షణ పడ్డారు. దీంతో అంజన్‌రెడ్డి గాయపడి, మృతిచెందాడు. నిందితులను గురువారం అరెస్టు చేసి, కదిరి కోర్టుకు హాజరు పరిచినట్లు తెలిపారు.

ఆర్డీటీకి లైసెన్స్ రెన్యువల్ చేయాలని వినతి

ధర్మవరం, మార్చి 21: ఆర్డీటీ సంస్థకు సంబంధించిన లైసెన్స్‌ను కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ఈనెల 31వతేదీలోగా రెన్యువల్ చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు రేగాటిపల్లి వరదరాజులు కోరారు. ఈ మేరకు గురువారం ఆయనతో పాటు నాయకులు గంగాద్రి, సురేశ్‌బాబు ఆర్డీఓ వెంకటశివారెడ్డిని కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వరదరాజులు మాట్లాడుతూ ప్రస్తుతం రాయలసీమజిల్లాలో ఎంతోమంది పేద ప్రజలు ఆర్డీటీ సంస్థ ద్వారా లబ్ధి పొందుతున్నారన్నారు. సంస్థ పేదల కోసం అనేక సేవా కార్యక్రమాలు చేస్తోందన్నారు. సంస్థలో దాదాపు 5వేల మంది దాకా ఉద్యోగాలు చేస్తూ ఉపాధి పొందుతున్నారన్నారు. కనుక లైసెన్స్‌ను రెన్యువల్ చేసి సంస్థను కాపాడాలని వారు కోరారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

ధర్మవరం, మార్చి 21: పట్టణంలోని ఇందిరా నగర్‌కు చెందిన వంశీకృష్ణ గురువారం తన ఇంటి సమీపంలో ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు, స్థానికులు వెంటనే మంటలు ఆర్పారు. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వంశీకృష్ణ ఆత్మహత్యయత్నానికి గల కారణాలు తెలియరాలేదు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ చేపట్టారు.

వైసీపీతో విసిగిపోయారు

- అందుకే ఆ పార్టీ శ్రేణులు టీడీపీలోకి వస్తున్నారు
- మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి విమర్శ
- ఆయన సమక్షంలో తెలుగుదేశంలోకి 200 కుటుంబాలు చేరిక



పల్లె సమక్షంలో టీడీపీలోకి చేరిన వైసీపీ శ్రేణులు

కొత్తచెరువు, మార్చి 21: వైసీపీ చేస్తున్న అకృత్యాలతో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలకే విసుగు వచ్చిందని, అందుకే చాలామంది అక్కడ ఇమడలేక టీడీపీలోకి వస్తున్నారని మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి విమర్శించారు. కొత్తచెరువులో గురువారం సుమారు 200 కుటుంబాల వారు వైసీపీని వీడి టీడీపీలోకి చేరారు. కార్యక్రమంలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పల్లె సింధూరారెడ్డి, ఆమె భర్త పల్లె వెంకటకృష్ణ కిశోర్ రెడ్డి పాల్గొన్నారు. పార్టీలో చేరిన వారికి పల్లెరఘునాథరెడ్డి కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. సీఎం జగన్ చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో ప్రజలతో పాటు వైసీపీ కార్యకర్తలు సైతం విసిగి వేసారిపోయారని అన్నారు. అందుకే ఆ పార్టీని వీడి టీడీపీలోకి చేరుతున్నారని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు సాలక్కగారిశ్రీనివాసులు, డాక్టర్‌స్వర్ణలత, ఒలిపిశీన, నరేంద్ర, మాజీ ఎంపీపీ వాణీశ్రీనివాస్, మాజీ సర్పంచ్ మాణిక్యంబాబా, నాయకులు భాస్కర్, జనసేన నాయకులు పత్తిచంద్రశేఖర్, శివ, అల్లాబకాష్, మాధవి, రాధమ్మ, తులసీ, విజయ్, గుర్రప్ప, శ్రీరాములు పాల్గొన్నారు.

అరాచక పాలనకు స్వస్తి చెబుదాం..

బుక్కపట్నం: వైసీపీ సాగిస్తున్న అరాచక పాలనకు స్వస్తి పలుకుదామని మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి పిలుపునిచ్చారు. బుక్కపట్నం తేరు సర్కిల్‌నుంచి శివాలయం వరకు రోడ్‌షో నిర్వహించారు. అనంతరం సుందరయ్యకాలనీ, కోట వీధిలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందన్నారు. పవిత్రమైన పుట్టపర్తిలో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి దందాలు తీవ్ర స్థాయికి చేరాయని దుయ్యబట్టారు. ప్రజా సంక్షేమాన్ని కోరే టీడీపీని గెలిపిద్దామని పిలుపునిచ్చారు. అధికారంలోకి వస్తే బుక్కపట్నం చెరువును టూరిజం హబ్‌గా చేసి పర్యటక ప్రాంతంగా మారుస్తామని పల్లె హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయ కర్త పత్తి చంద్రశేఖర్, టీడీపీ జిల్లాకార్యదర్శి సామకోటి ఆదినారాయణ, మండల కన్వీనర్ మల్లిరెడ్డి, నాయకులు జంగం వెంకటరాముడు, బాలు, సయ్యద్ బాషా, లావణ్యగౌడ్, యశోద, గంగాధర్, సంజీవరాయుడు, కరణం శ్రీరాములు, దాసరి శ్రీనివాసులు, తెలుగుయువత అంబులెన్సు రమేష్, సుధీర్, సతీష్‌రాయ్, సాకే నరేష్, మంజునాథ్, మన్సూర్, నరేష్ కార్యకర్తలు పాల్గొన్నారు.



బుక్కపట్నంలో రోడ్‌షో నిర్వహిస్తున్న మాజీ మంత్రి పల్లె

గెలుపే లక్ష్యం..

పుట్టపర్తి: తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి అధికారంలోకి రావడమే లక్ష్యంగా పనిచేద్దామంటూ మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పత్తి చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో గురువారం వారు మూడు పార్టీ కార్యకర్తల సమన్వయ సమావేశం నిర్వహించారు. చంద్రబాబు ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని పల్లె సూచించారు. వచ్చే ఎన్నికల్లో కూటమి అభ్యర్థి పల్లె సింధూరరెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని, చంద్రబాబును సీఎం చేసుకోవాలని పిలుపినిచ్చారు. జనసేన ఇన్‌చార్జి పత్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలన్న కుయుక్తులతో వైపీపీ మద్యం, డబ్బుతో ఓటర్లను మభ్యపెట్టేందుకు కుట్రలు చేస్తోందని, వీటి ని అడ్డుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టీ డీపీ కన్వీనర్లు విజయ్‌కుమార్, రామాంజనేయు లు, మైలేశంకర్, రామకృష్ణ, ఒలిపి శ్రీనివాసులు, మల్లిరెడ్డి, గోపాల్‌రెడ్డి, జనసేన జిల్లాప్రధానకార్యదర్శి అబ్దుల్, నాయకులు మేకల ఈశ్వర్, బొగ్గరం శ్రీనివాసులు, జయరాం, శివప్రసాద్, పెద్దన్న, మహేష్, నరేష్ పాల్గొన్నారు.

బలవంతంగా వైసీపీ కండువాలు వేశారు

- ఇఫ్తార్ విందుకు పిలిచి ఇలా చేశారంటున్న టీడీపీ కార్యకర్తలు



తాము టీడీపీనే అంటూ టీడీపీ కండువాలు వేసుకున్న మైనార్టీలు

ఓబుళదేవరచెరువు, మార్చి 21: తాము ఇఫ్తార్ విందుకు వెళితే.. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సమక్షంలో కొంతమంది వైసీపీ నాయకులు వారి పార్టీ కండువాలు వేశారని మైనార్టీలు వాపోయారు. గురువారం వైసీపీ కండువాలు వేసుకున్న బీడిపల్లి మహబూబ్‌బాషా, అబ్దుల్ రహిమాన్, ఆర్ఫీఖాన్, తబ్రేజ్, గౌస్‌మెయిద్దీన్ తదితరులు వెంటనే వారు మాజీ జడ్పీటీసీ పిట్టా ఓబులరెడ్డి ఆధ్వర్యంలో తిరిగి టీడీపీలోకి చేరారు. ఇఫ్తార్‌విందుకు ఆహ్వానించి బలవంతంగా వైసీపీ కండువాలు వేసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా పిట్టా ఓబుల రెడ్డి , మైనార్టీ నేతలు పొగాకు షబ్బీర్, చికెన్ షానూ మాట్లాడుతూ వైసీపీ వారు చీప్ ట్రిక్స్ చేయడం మానుకోవాలన్నారు. ఇఫ్తార్‌విందుకు పిలిపించి బలవంతంగా కండువాలు వేయడం తగదన్నారు. పైగా వందమంది చేరినట్లు అసత్య ప్రచారం చేయడం శోచనీయమన్నారు. కార్యక్రమంలో సహకార సంఘం మాజీ చైర్మన్ పిట్టా ప్రభాకర్‌రెడ్డి, నాయకులు పిట్టా రాజారెడ్డి, తుమ్మల మహబూబ్‌బాషా, మండోజీ ఆర్ఫీఖాన్, జెరిపిటి ఆంజనప్ప, సౌదీ నాగరాజు, అబ్బు, అఖిల తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం.. కాపర్‌వైరు చోరీ

ఓబుళదేవరచెరువు, మార్చి 21: మండలంలోని కొండకమర్లలో గల జగనన్న కాలనీలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని దుండగలు ధ్వంసం చేసిన అందులోని కాపర్ వైర్‌ను చోరీ చేశారు. విద్యుత్ ఏఈ రామసూరారెడ్డి, లైన్‌మన్ రామాంజనేయులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. జగనన్న కాలనీలో ఇటీవల రూ.రెండు లక్షల 20వేలు విలువ చేసే 22 కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చామన్నారు. కాగా గుర్తు తెలియని దుండగలు బుధవారం రాత్రి ట్రాన్స్‌ఫార్మర్‌ను కిందికి దించి ధ్వంసం చేసి, అందులో ఉన్న కాపర్ వైరు చోరీచేసినట్లు చెప్పారు. ధ్వంసమైన విషయాన్ని గురువారం గుర్తించామన్నారు. ఈ విషయంపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు వారు పేర్కొన్నారు.



ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్

గూడ్స్‌షెడ్ కొట్టాలలో కార్డెన్ సెర్చ్



గూడ్స్‌షెడ్‌కొట్టాలలో పర్యటిస్తున్న పోలీసులు

ధర్మవరం, మార్చి 21: పట్టణ సమీపంలోని గూడ్స్‌షెడ్‌కొట్టాలలో గురువారం టూటౌన్ సీఐ అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అనుమానితుల ఇళ్లల్లో సోదాలు చేశారు. అనంతరం సీఐ స్థానికులతో మాట్లాడుతూ ఎవరూ ఎలాంటి గొడవలకు వెళ్లరాదన్నారు. ప్రశాంతంగా జీవించాలన్నారు. సార్వత్రిక ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడరాదన్నారు. ఎవరైనా శాంతిభద్రత లకు భంగం కలిగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎవరైన కొత్తవ్యక్తులు కనపడితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ జోణాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

అలాగే కేశవనగర్‌లో వన్‌టౌన్ సీఐ సుబ్రమణ్యం సిబ్బందితో కలిసి కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటా తిరిగి తనిఖీలు చేపట్టారు. అనంతరం గ్రామస్థులతో సమావేశమై మాట్లాడారు. గ్రామంలోకి కొత్తవ్యక్తులు ఎవరైనా వస్తే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అనంతరం అక్కడ ఉన్న పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లా సరిహద్దులో చెక్ పోస్టు ఏర్పాటు

- పరిశీలించిన డీఎస్పీ శ్రీనివాసులు



చెక్‌పోస్టు వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

బత్తలపల్లి, మార్చి21: మండలంలోని యర్రాయపల్లి సరిహద్దు జిల్లా బోర్డర్ కావడంతో పోలీసులు చెక్ పోస్ట్ ఏర్పాటు చేశారు. సార్వత్రిక ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో అక్కడి చెన్నయ్ జాతీయ రహదారిపై రాకపోకలు సాగించే వాహనాలను తనిఖీ చేపట్టారు. దీనిని డీఎస్పీ శ్రీనివాసులు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఎవరూ కూడా అనుమతి లేకుండా అధిక మొత్తంలో డబ్బు తరలించరాదన్నారు. తనిఖీల్లో పట్టుబడితే సీజ్ చేస్తామన్నారు. అధిక మొత్తంలో నగదు తరలించే వారు అందుకు సంబంధించిన ఆధారాలు చూపాలన్నారు. అలాగే అక్రమ మద్యం తరలిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు. మండలలోని మాల్యవంతంగ్రామంలో పోలీసులు కార్డెన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అనుమానితుల ఇళ్లల్లో తనిఖీలు చేపట్టారు.

ఘనంగా నారా దేవాన్ష్ జన్మదినం

కదిరి, మార్చి 21: తెలుగుదేశం జాతీయ అధ్యక్షుడు, మాజీ సీఎం నారా చంద్రబాబునాయుడి మనవడు, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేష్ కుమారుడు నారా దేవాన్ష్ జన్మదిన వేడుకలను గురువారం పట్టణంలోని శ్రీవిజయలక్ష్మి ఫౌండేషన్ వారు ఘనంగా నిర్వహించారు. టీడీపీ నాయకుడు బంగారు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి పంచారు. కార్యక్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

సూపర్ సిక్స్‌పై ప్రచారం

నంబులపూలకుంట, మార్చి 21: మండలంలోని వెలిచెలమల, పడమర నడింపల్లి గ్రామాల్లో సూపర్ సిక్స్ పథకాలపై గురువారం టీడీపీ నాయకులు విస్తృత ప్రచారం చేశారు. ప్రతి ఇంటివద్దకూ వెళ్లి ప్రజలకు కరపత్రాలు పంచుతూ చంద్రబాబు ప్రకటించినసూపర్ సిక్స్ పథకాల వల్ల కలిగే లాభాలను వివరించారు. కందికుంట యశోదాదేవిని కదిరి ఎమ్మెల్యేగాను, చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకోవాలని సూచించారు. ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటు వేసి, గెలపించాలని కోరారు. మార్కెట్‌యార్డు మాజీ డైరెక్టర్ పోమేనాయక్, విజయకుమార్ యాదవ్, రాజశేఖర్ యాదవ్, గోపాల్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



వెలిచెలమలలో సూపర్ సిక్స్‌పై ప్రచారం చేస్తున్న టీడీపీ నాయకులు

వైసీపీ స్టిక్కర్ల తొలగింపు

నల్లచెరువు, మార్చి 21: ఎన్నికల కోడ్ అమలుల్లోకి వచ్చినా.. మండలకేంద్రంలో పలుచోట్ల అలాగే ఉన్న వైసీపీ స్టిక్కర్లను తహసీల్దార్ రవికుమార్ స్వయంగా గురువారం తొలగించారు. తహసీల్దార్‌తో పాటు ఎంపీడీఓ రాణెమ్మ, సిబ్బంది ప్రభుత్వ కార్యాలయాలు తిరిగి నిబంధనలకు విరుద్ధంగా వాటిని తొలగింప చేశారు. బస్టాండ్ ప్రాంతంలో విద్యుత్ స్తంభాలకు , ఇళ్లకు అంతికించిన వైసీపీ స్టిక్కర్లను తొలగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నిల నిబంధనలు ప్రతి ఒక్కరు పాటించా లన్నారు. నిబంధనలు ఉల్లంగించిన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వలంటీర్లు, ఉద్యోగులు ఎన్నికల ప్రచారంలో పాల్గొనరాదని సూచించారు.



ఇంటికి ఉన్న జగన్ స్టిక్కర్‌ను తొలగిస్తున్న దృశ్యం

ఎన్నికల ప్రచారంలో పాల్గొంటే చర్యలు

బత్తలపల్లి, మార్చి 21: మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం తహసీల్దార్ శివశంకర్ నాయక్ స్టోర్ డీలర్లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మా ట్లాడుతూ.. వచ్చే సార్వత్రిక ఎన్నికలలో రాజకీయ పార్టీ అభ్యర్థులు వెంట, నాయకుల వెంట తిరిగినా, ప్రచారంలో పాల్గొన్నా, ఫలానా అభ్యర్థికి ఓటు వేయమని ఓటర్లను అడిగి నా డీలర్ పదవి నుంచి సస్పెండు చేస్తామని హెచ్చరించారు. కావున డీలర్లు ఎన్నికల ప్రచారాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మండలంలోని పలువురు డీలర్లు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించరాదు

ఓబుళదేవరచెరువు, మార్చి 21: ఎన్నికల కోడ్‌ను ఎట్టిపరిస్థితుల్లోనూ ఉల్లంఘించరాదని, ఎవరైనా ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ ఖాజాబీ, ఎంపీడీఓ వరలక్ష్మి హెచ్చరించారు. మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం వారు మండలంలోని సచివాలయ మహిళా పోలీసులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎన్నికల కోడ్ గురించి వివరించారు. ఎక్కడైనా ఎవరైనా ఎన్నికల కోడ్‌ను ఉల్లంగిస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి మహిళా పోలీసుల సహకారం ఎంతో అవసరమన్నారు. సమావేశంలో ఈఓఆర్డీ రాజశేఖర్, కార్యదర్శులు రామలింగారెడ్డి, శ్రీకాంత్, నౌషాద్, రఫీక్, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

నేడు రాజకీయ నాయకులతో సమావేశం

ఓబుళదేవరచెరువు, మార్చి 21: ఎన్నికల దృష్ట్యా మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10గంటలకు రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ ఖాజీబీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి జాతీయ, రాష్ట్ర పార్టీల ప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

పంటరుణాలు రెన్యువల్ చేసుకోండి

గాండ్లపెంట, మార్చి21: సహకార సం ఘంలో పంట రుణాలు తీసుకున్న రైతులు వెంటనే రెన్యువల్ చేయించాలని సీఈఓ షామీర్‌బాషా, చైర్మన్ ఎస్‌పీ హైదర్‌వలి గురువారం పకటనలో సూచించారు. సహకార బ్యాం కులో పంటరుణాలు తీసుకున్న రైతులు వడ్డీ చెల్లించి ఈనెలాఖరులోపు రెన్యువల్ చేసుకోవాలన్నారు. సకాలంలో రెన్యువల్ చేసుకున్న రైతులకు ప్రభు త్వ రాయితీలు వర్తిస్తాయన్నారు. రెన్యువల్ చే యించే వారు వన్‌బీ అడంగల్, ఆధార్, రెండు పాస్‌ఫొటోలు తీసుకుని రావాలని తెలిపారు.

స్ప్రింక్లర్లు చోరీ

నల్లమాడ, మార్చి 21: మండలంలోని దొన్నికోటకు చె ందిన న్యాయవాది కోహినూర్ రవూఫ్ మామిడి తోటలో ఈనెల 20వ తేదీన గుర్తు తెలియని వ్యక్తులు బోరు పైపులు, స్ప్రింకర్లు చోరీ చేసినట్లు గురువారం పోలీసులకు ఫిర్యా దు చేశారు. దాదాపు రూ. 40వేలు నష్టం జరిగిందని, న్యాయం చేయాలని బాధితుడు ఫిర్యాదులో కోరారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్ల శ్రమదానం

ముదిగుబ్బ, మార్చి21: మండల కేంద్రంలోని ఎస్‌డీఆర్ఆర్ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గురువారం మండలంలోని ఒలించెర్లోపల్లి గ్రామంలో శ్రమదానం చేపట్టి రోడ్డు మరమ్మతులు నిర్వహించారు. ఇందులో భాగంగా రోడ్డుపై పడిన గుంతలను మట్టి వేసి పూడ్చేశారు.

గంగమ్మ ఆలయానికి మైక్ సెట్ వితరణ

నంబులపూలకుంట, మార్చి 21: మండలంలోని దిగువ గూటిబైలు గ్రామంలో గల గంగమ్మ ఆలయానికి బీజేపీ మైనార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాబ్‌జాన్ మైక్‌సెట్‌ను వితరణ చేశారు. ఆలయంలో భజనలు చేసుకుంటున్న భక్తులు మైక్‌సెట్ కావాలని గతంలో కోరారు. స్పందించిన బాబ్‌జాన్ మైక్‌సెట్‌ను గురువారం వితరణ చేశారు. ఇందుకు ఆయనకు గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు జయరాములు, వెంకటరమణ, చాంద్‌బాషా, గ్రామస్తులు పాల్గొన్నారు.

వలంటీర్లు, ఉద్యోగులు ప్రచారాల్లో పాల్గొంటే కఠిన చర్యలు : ఎంపీడీఓ

గుడిబండ, మార్చి 21: సార్వత్రిక ఎన్నికల ప్రచారాల్లో గ్రామ, వార్డు వలంటీర్లు, ఉపాధిహామీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, ఉద్యోగులు పాల్గొంటే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ బంగారమ్మ హెచ్చరించారు. ఈ మేరకు ఆమె గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల ప్రచారాల్లో వారెవరూ పాల్గొనరాదని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందినట్లు ఆమె తెలిపారు. ఎన్నికల నియమావళిని ఉద్యోగులు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎంపీడీఓ హెచ్చరించారు.

మద్దనకుంటలో పోలింగ్ కేంద్రం ఏర్పాటుకు నివేదించాం: తహసీల్దార్

గుడిబండ, మార్చి 21: మండలంలోని మద్దనకుంట గ్రామంలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు కోసం ఉన్నతాధికారులకు నివేదించినట్లు తహసీల్దార్ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. మే నెలలో జరగబోయే లోక్‌సభ, శాసనసభ ఎన్నికల కోసం తమ గ్రామంలో పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలని మద్దనకుంట ప్రజలు విన్నవించారని ఆయన గురువారం తెలిపారు. ప్రజల వినతుల మేరకు పోలింగ్ బూత్ ఏర్పాటు కోసం జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపినట్లు తహసీల్దార్ తెలిపారు.

నోటి పరిశుభ్రతపై అవగాహన

గోరంట్ల, మార్చి 21: ప్రతిఒక్కరు నోటిని, దంతాలను శుభ్రం చేసుకోవడం వలన ఆరోగ్యంగా ఉంటారని ప్రభుత్వ దంత వైద్యుడు డాక్టర్ వేణుగోపాల్ తెలిపారు. ప్రపంచ ఓరల్‌హెల్త్ డే సందర్భంగా గురువారం గోరంట్లలోని ప్రభుత్వ ఆసుపత్రి వద్దనుంచి ప్రధాన రహదారిపై వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. బస్టాండ్ కూడలిలో ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ... నోరు, దంతాల శుభ్రతవలన క్యాన్సర్‌లాంటి వ్యాధులు దరి చేరవని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ఆశాకార్యకర్తలు ఉన్నారు.

చట్టాలపై దివ్యాంగులకు అవగాహన

రొద్దం, మార్చి 21: గ్రామీణ ప్రాంతాల్లోని దివ్యాంగులు చట్టాలపై అవగాహన పెంచుకుని, తమ హక్కులు పొందేందుకు సిద్ధం కావాలని దివ్యాంగుల సొసైటీ సీఈఓ నరసింహులు తెలిపారు. ఆయన గురువారం రొద్దం మండల పరిధిలోని కలిపి గ్రామంలో దివ్యాంగులకు లీగల్‌క్యాంప్ నిర్వహించారు. ప్రభుత్వం నుంచి దివ్యాంగులు పొందే ప్రయోజనాలు, వారికున్న హక్కులను తెలియజేశారు. ఎవరైనా దివ్యాంగుల హక్కులను కాలరాస్తే ఎలాంటి న్యాయం పొందాలో వివరించారు. ఈ సందర్భంగా నాటిక ద్వారా అవగాహన కల్పించారు. దివ్యాంగుల సొసైటీ డైరెక్టర్లు రామాంజనేయులు, వరలక్ష్మి, సభ్యులు పాల్గొన్నారు.

పురం ఆసుపత్రి సూపరింటెండెంట్‌గా లింగన్న

హిందూపురం అర్బన్, మార్చి 21: పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్‌గా లింగణ్ణను నియమిస్తూ బీసీహెచ్ పాల్‌రవికుమార్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇంతకు ముందున్న ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ రోహిల్‌ను ఆయన డిపార్టుమెంట్ ఫోరెన్సిక్ విభాగంలో కొనసాగేలా తెలిపారు. లింగన్న ప్రస్తుతం పిడియాట్రిక్ హెడ్‌గా, సివిల్ సర్జన్‌గా పని చేస్తున్నారు.

పాఠశాలలో లోపించిన క్రమశిక్షణ

ఘర్షణపడ్డ విద్యార్థులు

లేపాక్షి, మార్చి 21 : స్థానిక ప్రభుత్వ ఓరియంటల్ పాఠశాలలో ఉపాధ్యాయులు పట్టించుకోకపోవడం వల్ల విద్యార్థుల్లో క్రమశిక్షణ లోపించిందని విద్యార్థుల తల్లిదండ్రులు విమర్శిస్తున్నారు. పాఠశాలలో బుధవారం ఇద్దరు విద్యార్థుల మధ్య జరిగిన గొడవ తలలు పగలకొట్టుకునే దాకా వెళ్లింది. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇందుకు సంబంధించి తోటి విద్యార్థులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక ప్రభుత్వ ఓరియంటల్ పాఠశాలలో బుధవారం ఏడో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థుల నడుమ చిన్నపాటి గొడవ మొదలైంది. ఈ క్రమంలో ఒక విద్యార్థి తన వద్ద ఉన్న స్టీల్ వాటర్ బాటిల్‌తో తలపై మోదడంతో మరో విద్యార్థి తలకు గాయమై రక్తం కారసాగింది. అతడిని లేపాక్షి ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యుల సూచన మేరకు హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ఐదు కుట్లు వేసి చికిత్సలు అందించారు. ఇప్పటి కైనా ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను అక్కడి ఉపాధ్యాయులు క్రమశిక్షణలో పెట్టాలని ప్రజలు కోరుతున్నారు.

గడ్డివాములకు నిప్పు

గోరంట్ల, మార్చి 21: మండలంలోని శిరగంవాండ్లపల్లిలో గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో మూడు గడ్డి వాములు కాలిపోయాయి. దీంతో రూ. 50వేలు ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు వాపోతున్నారు. శిరగంవాండ్లపల్లికి చెందిన బోయ గంగరత్నమ్మ పశువుల మేత కోసం బండి వరిగడ్డి, నాలుగు బండ్ల మొక్కజొన్న చొప్పను కొనుగోలు చేసి వామి వేసుకుంది. అలాగే వెంకటశివారెడ్డి రెండు ట్రాక్టర్ల వరి గడ్డిని నిలువ చేసుకున్నాడు. అయితే గుర్తు తెలియనివారు గురువారం తెల్లవారుజామున నిప్పు పెట్టడంతో ఆ వాములు కాలిబూడిదయ్యాయని బాధితులు తెలిపారు. గ్రామస్థులు మంటలు ఆర్పడానికి ప్రయత్నం చారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది పుట్టపర్తి నుంచి యంత్రంతో వచ్చి మంటలను పూర్తిగా ఆర్పివేశారు. అగ్నిమాపక యంత్రం రానిపక్షంలో పక్కనే ఉన్న హనుమంతురెడ్డికి చెందిన్న మొక్కజొన్న గడ్డివామి, రెండెకరాల్లో కోతకు సిద్ధంగా ఉన్న రామక్రిష్ణరెడ్డికి చెందిన మొక్కజొన్న పంట కాలిపోయి తీవ్ర నష్టం జరిగేదని గ్రామస్థులు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితులు తెలిపారు.

కర్ణాటక మద్యం పట్టివేత

హిందూపురం, మార్చి 21: కర్ణాటక నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని సెబ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. హిందూపురం పట్టణ పరిధిలో ని పోచన పల్లివద్ద సెబ్ అధికారులు గురువారం వాహ నాలు తనిఖీ చేస్తుండగా కర్ణాటక నుంచి ఓ వ్యక్తి 12 బాక్సుల కర్ణాటక మద్యం తీసుకొస్తుండగా తనిఖీల్లో సెబ్ పోలీసుల పట్టుబడింది. ఈ మద్యాన్ని అతడు హిందూపురంలో డోర్ డెలివరీ చేస్తున్నట్లు సమాచారం. అదేవిధంగా టూటౌన్ పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా తొమ్మిది బాక్సుల మద్యం పట్టుబడింది.

లేపాక్షి : కర్ణాటక రాష్ట్రం నుంచి ఆంధ్రకు అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ సీఐ రాజశేఖర్‌గౌడ్ తెలిపారు. మండ లంలోని మామిడిమాకులపల్లి వద్ద గురువారం తెల్లవా రుజామున 4గంటల సమయంలో అక్రమంగా మద్యం తరలిస్తున్న అదే గ్రామానికి చెందిన వ్యక్తి అదుపులోకి తీసుకున్నామన్నారు. అతడివద్ద నుంచి 192మద్యం బాటిళ్లు, ద్విచక్రవాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అతడిపై గతంలో పలుమార్లు కేసులు నమోదుచేసి అరెస్టుచేసినట్లు తెలిసింది. ఇప్పుడు కూడా కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

భవిష్యత్తు బాగుండాలంటే బాబు సీఎం కావాలి

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత



సమావేశంలో మాట్లాడుతున్న సవిత, పాల్గొన్న అంబికా లక్ష్మీనారాయణ

గోరంట్ల, మార్చి 21: రాష్ట్రంతోపాటు అన్నివర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలన్నా, భావితరాల భవిష్యత్తు బాగుండాలన్నా టీడీపీ అధికారంలోకి వచ్చి చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే సాధ్యమని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి సవిత పేర్కొన్నారు. గోరంట్లలోని ఎస్ఎల్ఎన్ ఫంక్షన్ హాల్‌లో గురువారం టీడీపీ మండల విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి సవితతో పాటు టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మీనారాయణ తదితరులు హాజరయ్యారు. ఈ సమావేశంలో సవిత మాట్లాడుతూ... గతంలో మాజీ ఎంపీ నిమ్మల కిష్టప్ప, మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారథి చేసిన అభివృద్ధే మండలంలో ఎక్కడ చూసినా కనిపిస్తోందన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో దోచుకోవడం, దాచుకోవడమే తప్ప అభివృద్ధి శూన్యమన్నారు. ఓటు అడిగే హక్కు ఒక్క టీడీపీకి మాత్రమే ఉందన్నారు. తమ పార్టీలో గ్రూపు రాజకీయాలు లేవని, అంతా టీడీపీ కుటుంబ సభ్యులమే అన్నారు. ప్రజలు తమ సమస్యలను తనతో ఎప్పుడైనా యథేచ్ఛగా చెప్పుకోవచ్చన్నారు. డబ్బుతో ఓట్లు కొనాలని సీఎం జగన్ చూస్తు న్నారని విమర్శించారు. నియోజకవర్గాన్ని దోచుకునేందుకు ఓ వలస పక్షి ఇక్కడికి వచ్చిందన్నారు. మంత్రి ఉష కళ్యాణదుర్గంలో ఓటు వేసి గెలిపించిన ప్రజలకు, పార్టీ శ్రేణులకు ఏమి చేశారని ప్రశ్నించారు. ఆమె దౌర్జన్యాల గురించి కథలు కథలుగా చెప్పుకుంటున్నారని తెలిపారు. కళ్యాణదుర్గం అభివృద్ధిపై చర్చించడానికి తాను ఎప్పుడైనా సిద్ధమని సవాలు విసిరారు. మాజీ మంత్రి శంకర్‌నారాయణ తమ్ముళ్ల ద్వారా వాటాలు పంచుకోవడానికి దేవుడి మాన్యం సైతం వదలలేద న్నారు. వలస పక్షులు వస్తుంటాయి పోతుంటాయని, అయితే నిమ్మల కిష్టప్ప, పార్థసారథి ఓడిపోయినా, ఇక్కడే ఉంటున్న విషయం గుర్తు చేశారు. అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. సంక్షేమపథకాల ద్వారా టీడీపీ రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలిపిందన్నారు. వైసీపీ పాలనలో నేడు ప్రపంచంలో ఏపీ అట్టడుగుస్థాయికి చేరిందన్నారు. వైసీపీ నాయకులు దిగజారి అక్రమాలు, అరాచకాలు, అవినీతి చర్యలతో పక్కరాష్ట్రాల వారు విమర్శించేస్థాయికి చేరారన్నారు. వైసీపీ అభ్యర్థి ఉష వలస పక్షిగా వచ్చి, పెన్నానది, చిత్రావతిలోని ఇసుకను మొత్తం దోచే యడానికి సిద్ధంగా ఉన్నారని ఎద్దేవా చేశారు. ఈసందర్భంగా కాంగ్రెస్‌పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజారెడ్డి ఆధ్వర్యంలో 20కుటుంబాలు, వైసీపీ నాయకులు తాటిమేకలపల్లి, గట్టు చంద్రశేఖర్‌రెడ్డి, గుమ్మయ్యగారిపల్లి మాజీ ఎంపీటీసీ కిష్టప్ప, బోయలపల్లి అశ్వర్థరెడ్డి ఆధ్వర్యంలో దాదాపు 80 కుటుంబాలు టీడీపీ లో చేరారు. సవిత వారికి కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు నరసింహరావు, మాజీ ఎంపీపీ నిమ్మల విద్యా ధరిణి, నిమ్మల యువశేఖర్, కన్వీనర్ సోముశేఖర్, రామచంద్ర, సుబ్రహ్మణ్యం, కక్కల రఘునాథ్‌రెడ్డి, వేణుగోపాల్, ఉమ్మర్‌ఖాన్, బాలక్రిష్ణచౌదరి, జనసేన నాయకులు సంతోష్, సురేష్, వెంకటేష్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

అరాచక పాలనకు అంతిమ ఘడియలు

టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్



తురుకువాండ్లపల్లిలో సూపర్‌సిక్స్ పథకాలపై వివరిస్తున్న సునీల్‌కుమార్

మడకశిర రూరల్, మార్చి 21 : రాష్ట్రంలో సీఎం జగన్ ఐదేళ్లుగా సాగించిన అరాచక పాలనకు అంతిమ ఘడియలు దగ్గరపడ్డాయని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్‌కుమార్ పేర్కొన్నారు. ఆయన గురువారం మండలంలోని గౌడనహళ్లి పంచాయతీ పరిధిలో జమ్మానిపల్లి, తురుకువాండ్లపల్లి, గౌడనహళ్లిలో ప్రచారం నిర్వహించారు. ఇందులో మాజీ ఎమ్మెల్యే మద్దన కుంట ఈరన్న, ఎన్నిల ఎన్నికల పరిశీలకురాలు పర్వీన్‌తాజ్ పాల్గొన్నారు. జమ్మానిపల్లిలో నిడి మామిడమ్మ, గౌడనహళ్లిలో అంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సునీల్‌కుమార్ మాట్లాడుతూ.. రాష్ట్ర భవిష్య త్తు కోసం చంద్రబాబు సీఎం కావలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. టీడీపీ మినీమేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి

పార్టీ నియోజకవర్గ పరిశీలకురాలు పర్వీనాతాజ్

మడకశిర టౌన్, మార్చి 21: రాష్ట్ర భవిష్యత్తు బాగుండాలంటే తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావాలని ఆ పార్టీ నియోజకవర్గ పరిశీలకురాలు పర్వీనాతాజ్ అన్నారు. వైసీపీ మరోసారి అధికారంలోకి వస్తే మరో చత్తీస్‌గఢ్, బీహార్‌లా మారుతుందని హెచ్చరించారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో గురువారం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సునీల్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే మద్దనకుంట ఈరన్నతో కలిసి ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ క్రమశిక్షణకు మారుపేరని, పార్టీ అధినేత చంద్రబాబు ఆదేశాలను అందరూ తు.చ. తప్పకుండా పాటించాలన్నారు. భవిష్యత్తు తరాల కోసం, రాష్ట్ర అభివృద్ధి కోసం చంద్రబాబును ముఖ్యమంత్రిగా చేసుకొందామని పిలుపునిచ్చారు. గ్రామ, వార్డు వలంటీర్లు వైసీపీ తరఫున ప్రచార కార్యక్రమాల్లో పాల్గొం టున్నా రని వారిపై దృష్టి పెట్టాలని, ఈసీ దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో ప్రతి ఇంటికి వెళ్లి వివరిం చాలన్నారు. వైసీపీ అరాచకాలు, అవినీతిని ఎండగట్టాలన్నారు. టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో సాగుదామని పిలుపునిచ్చారు.

బీజేపీతోనే సుపరిపాలన: మైనార్టీ మోర్చా

హిందూపురం అర్బన్, మార్చి 21: భారతీయ జనతా పార్టీతోనే సుపరిపాలన అందుతుందని మైనార్టీ మోర్చా జిల్లా కార్యదర్శి ముంతాజ్, జిల్లా ఉపాధ్యక్షుడు అమీర్‌జాన్ పేర్కొన్నారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో గురువారం మైనార్టీ మోర్చా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ప్రధాని నరేంద్రమోదీ కలమత విభేదాలు లేకుండా అందరినీ సమానంగా చూస్తున్నారన్నారు. సుపరిపాలన అందిస్తూ దేశాన్ని అభివృద్ధి బాటలో నడుపుతున్నాడన్నారు. మైనార్టీలకు బీజేపీ వ్యతిరేకమన్న అపోహను తిప్పి కొట్టేలా మన రాష్ట్రంలో ప్రధాని ఆవాస్ పథకం ద్వారా 25 లక్షల ఇళ్లు కేటాయిస్తే అందులో దాదాపు 14 లక్షల ఇళ్లు మైనార్టీలకే కేటాయించారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో జలజీవన్ పథకం ద్వార ప్రతి ఇంటికి నీరు అందిస్తున్నారన్నారు.

మహిళా సాధికారత టీడీపీతోనే సాధ్యం: సవిత

గోరంట్ల, మార్చి 21: రాష్ట్రంలో మహిళ సాధికారత, సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత పేర్కొన్నారు. మండలంలోని నిషా గ్యార్మెంట్సు పరిశ్రమలో గురువారం ఏర్పాటు చేసిన కార్మికుల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గం పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చెందాలంటే టీడీపీ అధికారంలోకి రావాలన్నారు. మహిళలకు ఉపాధి కల్పించాలన్న ఉద్దేశ్యంతోనే కియ పరిశ్రమ వద్ద చంద్రబాబు సభను ఏర్పాటు చేశామన్నారు. గ్యార్మెంట్స్ పరిశ్రమను పెనుకొండ నియోజకవర్గంలో ఏర్పాటు చేస్తామని ఆయన హామీఇచ్చారన్నారు. చంద్రబాబును ముఖ్యమంత్రిని చేస్తే ఈ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందడంతోపాటు నిరుద్యోగ సమస్య ఉండదన్నారు ఈసమావేశంలో టీడీపీ, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పట్టణంలో జోరుగా ప్రచారం

పెనుకొండ టౌన్ : టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి సవిత గురువారం పట్టణంలో జోరుగా ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి తెలుగుదేశం పార్టీ విడుదల చేసిన సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా సవిత మాట్లాడుతూ పెనుకొండ పట్టణంలో ఏ చిన్న అభివృద్ధి జరిగినా టీడీపీ హయాంలోనే అన్నారు. పెనుకొండ రూపురేఖలు మారడానికి తెలుగుదేశం పార్టీయే కారణమన్నారు. చదువుకున్న యువత, విద్యావంతులు ఆలోచించాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల మాజీ కన్వీనర్ శ్రీరాములు యాదవ్, జఫ్రుల్లాఖాన్, షౌకత్, దాదు, రఘు, పాలడుగు చంద్ర, దాదు, కన్నా, ఇందాద్, నారాయణస్వామి, రాధ తదితరులు పాల్గొన్నారు.

మామిడి చెట్లకు నిప్పు

ఉద్దేశపూర్వకంగానే నిప్పు పెట్టారన్న బాధితుడు



కాలిపోయిన మామిడి చెట్లు

హిందూపురం, మార్చి 21: మండలకేంద్రమైన పరిగి వద్ద పచ్చని మామిడి చెట్లకు నిప్పు పెట్టారని పరిగికి చెందిన బీజేపీ మండల కన్వీనర్ భద్రీనాథ్ వాపోయాడు. ఆయన తండ్రి శ్రీరాములు 14 ఏళ్ల కిందట శ్రీరంగరాజు పల్లికి వెళ్లే రహదారి పక్కన పరిగి చెరువుకు ఆనుకొని సర్వేనంబర్ 356-5-సీలోని 3.52 ఎకరాలను కొనుగోలు చేశాడు. ఈ పొలంలో 220 మామిడి చెట్లు, వంద టెంకాయ చెట్లు నాటారు. అయితే గురువారం సాయంత్రం 4 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు మామిడి చెట్లకు నిప్పు పెట్టారని భద్రీనాథ్ పేర్కొన్నారు. ఇది పక్క పొలం వారు చూసి భద్రీనాథ్‌కు సమాచారం ఇచ్చారు. ఆయన అక్కడికి చేరుకునే లోగా 24 మామిడి చెట్లు, రెండు టెంకాయ చెట్లు, ఒక చింత చెట్టు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. ప్రస్తుతం మామిడి చెట్లు కాయల దశకు వచ్చాయని, పలు చెట్లలో కాయలు కూడా పూర్తిగా కాలిపోయాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు. దీనిపై భద్రీనాథ్ మాట్లాడుతూ... తమకు ఎవరూ శత్రువులు లేరన్నారు. అయితే ఎవరో కావాలనే ఉద్దేశ్యపూర్వకంగా నిప్పు పెట్టారని అన్నారు. భద్రీనాథ్ వైసీపీలో ఉంటూ కొంత కాలం క్రితం బీజేపీలో చేరారు. దాంతో అధికార పార్టీ వారే ఈ పని చేసి ఉంటారని అనుమానిస్తున్నారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ప్రముఖ పారిశ్రామికవేత్త ధరంపాల్ మృతికి వివాళి

పావగడ, మార్చి 21: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, ప్రముఖ పారిశ్రామికవేత్త జీఎస్ ధరంపాల్(92) గురువారం అర్ధరాత్రి మృతి చెందారు. ధరంపాల్ చివరి వరకు కాంగ్రెస్ పార్టీలోనే ఉంటూ, పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని మాజీ మంత్రి వెంకటరమణప్ప అన్నారు. ఆయన మృతి కాంగ్రెస్ పార్టీకి, తాలూకాకు తీరని లోటని ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేష్ అన్నారు. ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తాలూకాలోని అన్ని పార్టీలకు చెందిన నాయకులు ఆయనకు శ్రద్ధాంజలి ఘటించారు.

మల్బరీ సాగులో జాగ్రత్తలు పాటించండి

సెరికల్చర్ జేడీ పద్మమ్మ



చాపర్లపల్లిలో పట్టుపురుగుల పెంపకాన్ని పరిశీలిస్తున్న జేడీ

మడకశిర రూరల్, మార్చి 21 : ప్రస్తుతం వేసివిలో ఎండలు అధికంగా ఉన్నా యని, మల్బరీ రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సెరీకల్చర్ జేడీ పద్మమ్మ పేర్కొన్నారు. ఆమె గురువారం మండలంలోని జిల్లేడగుంట, భక్తర హళ్లి, చాపర్లపల్లిలో ఆమె పర్యటించారు. రైతులు సాగుచేసిన మల్బరీ తోటలను పరిశీలించారు. పట్టుపురు గుల పెంపకంలో తీసుకోవాల్సి జాగ్రత్తలను రైతులకు వివరించారు. జేడీ వెంట సెరీకల్చర్ ఏడీ రాజునాయక్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

క్రికెట్ బ్యాట్లు సీజ్



పోలీసులు స్వాధీనం చేసుకున్న క్రికెట్ బ్యాట్లు, వాహనం

చిలమత్తూరు, మార్చి 21: సరైన పత్రాలు లేని కారణంగా బెంగళూరు నుంచి ఉత్తర ప్రదేశ్‌కు తీసుకెళుతున్న వంద క్రికెట్ బ్యాట్లను పోలీసులు సీజ్ చేసినట్లు ఎస్ఐ గంగాధర్ గురువారం తెలిపారు. ఉత్తరప్రదేశ్‌కి చెందిఎన ఆకాష్ సింగ్ తన వాహనంలో వంద క్రికెట్ బ్యాట్లను తీసుకెళుతుండగా కొడికొండ చెక్‌పోస్టులో చేపడుతున్న పోలీసుల తనిఖీలో పట్టుబడ్డాయన్నారు. సంబంధిత క్రికెట్ బ్యాట్లకు సరైన పత్రాలు అతడి వద్ద లేకపోవడంతో వాటిని సీజ్ చేశామన్నారు. నాగపూర్‌లో జరుగుతున్న ఓ క్రికెట్ టోర్నమెంట్ కోసం ఈ బ్యాట్లు తీసుకెళుతున్నట్లు ఆకాష్ సింగ్ తెలిపాడన్నారు. స్వాధీనం చేసుకున్న బ్యాట్లతోపాటు వాహనాన్ని హిందూపురం ఎన్నికల రిటర్నింగ్ అధికారి వద్దకు పంపామని ఎస్ఐ తెలిపారు.

బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులకు డిక్లరేషన్ అందిస్తున్న ఎన్నికల అధికారి

పెనుకొండ, మార్చి 21: స్థానిక బార్ అసోసియేషన్ 2024-25 సంవత్సరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. స్థానిక బార్ అసోసియేషన్ కార్యాలయంలో గురువారం ఎన్నికల అధికారి న్యాయవాది అబూబాకర్, న్యాయవాదులు నరేంద్రరెడ్డి, వినోద్ నాయక్ ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. ఈ ఎన్నికల్లో బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా మదన్‌మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా మోహన్‌నాయక్, కార్యదర్శిగా శరత్‌బాబు, సంయుక్త కార్యదర్శిగా అశ్వత్థనారాయణ, కోశాధికారిగా రాజేష్‌నాయక్, గ్రంథాలయ కార్యదర్శిగా విశ్వనాథ్‌నాయక్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి తెలిపారు. కార్యనిర్వాహక సభ్యులుగా దయానందరెడ్డి, నాగార్జున, ధర్మేంద్రరెడ్డి, కృష్ణమూర్తి, శ్రీరాములు ఎంపికైనట్లు తెలిపారు. వారికి డిక్లరేషన్ పత్రాలను అందించారు. నూతన కార్యవర్గ సభ్యులను సీనియర్ న్యాయవాదులు చంద్రశేఖర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, సుదర్శన్ రెడ్డి, రమేష్, శ్రీకాంత్‌రెడ్డి, కమలాకర్‌రెడ్డి, విశ్వనాథ్, ఆసిఫ్, శ్రీనివాసులు, లక్ష్మీనారాయణ, సుబ్రహ్మణ్యం తదితరులు పూలమాలలతో సత్కరించారు.

ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు



రహదారి పక్కన కూలడానికి సిద్ధంగా ఉన్న విద్యుత్ స్తంభాలు

పెనుకొండ రూరల్, మార్చి 21: భారీ ప్రమాదం, ప్రాణనష్టం జరిగితేకానీ విద్యుత్ శాఖాధికారులు పట్టించుకోరా అని మావటూరు గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. మండలంలోని మావటూరు వద్ద విద్యుత్ స్తంభాలు చాలా ప్రమాదకర పరిస్థితిలో ఉన్నాయి. మావటూరు విద్యుత్ సబ్ స్టేషన్ నుంచి వివిధ గ్రామాల వ్యవసాయ బోరుబావులకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు 11కేవీ విద్యుత్ లైన్ లాగారు. ఇందుకోసం మావటూరు నుంచి మడకశిర వెళ్లే రహదారిలో విద్యుత్ స్తంభాలుత ఏర్పాటు చేశారు. ఆ విద్యుత్ స్తంభాలు కొన్ని నెలల నుంచి ఒక పక్కకు ఒరిగి కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. మడకశిర వైపు నుంచి వందల సంఖ్యలో ఆటోలు, ఇతర వాహనాలు ఆ మార్గంలో వివిధ గ్రామాలకు వెళ్తుంటాయి. ఈ క్రమంలో రహదారి పక్కన పక్కకు ఒరిగిపోయిన విద్యుత్ స్తంభాల వల్ల ఏక్షణంలోనైనా ప్రమాదం పొంచిఉందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అడుగంటిపోతున్న భూగర్భ జలం



బోరు ఎండిపోవడంతో బీడుగా దర్శనమిస్తున్న పంటపొలం

- ఎండిపోతున్న బోర్లు, బావులు
- బీడుగా మారుతున్న పంటపొలాలు
- ఆందోళనలో మడకశిర రైతులు

మడకశిర, మార్చి21: ప్రకృతి వైపరీత్యాలు రైతుల జీవితాలను కష్టాల పాల్జేస్తున్నాయి. తీవ్ర వర్షాబావ పరిస్థితుల కారణంగా చెరువులలో నీరు చేరడం లేదు. భూగర్భజలాలు అడుగంటి పోయి బోర్ల లో బోర్లు ఎండి పోతున్నాయి. దీంతో గతంలో ఏన్నడూ లేని విధంగా ఈ యేడు ఖరీఫ్, రబీలో సాగు విస్తీర్ణం బాగా తగ్గి పోయింది. వేలాది ఎకరాలు బీళ్లుగా మారాయి. అరకొర నీటితో బోర్లు, బావుల కింద సాగు చేసిన పంటలకు నీటితడి అందించక పోవడంతో అవి కాస్త ఎండి పోతున్నాయి. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కర్ణాటక సరిహద్దు ప్రాంతమైన మడకశిర నియోజకవర్గంలో ఎటువంటి సాగు నీటి వనరులు లేవు. ఈ ప్రాంతం రైతులు వర్షాధారిత పంటలు, బోర్ల కింద పంటలు సాగు చేసి జీవనం సాగిస్తున్నారు. నియోజకవర్గంలో దశాబ్ద కాలంగా సరైన వర్షాలు కురవక సాగు విస్తీర్ణం తగ్గడమే కాకుండా, సాగుచేసిన పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీంతో పంటల సాగుకు చేసిన అప్పులు తీర్చ లేక పలువురు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ క్రమంలో వర్షాభావ పరిస్థితుల కా రణంగా గతయేడు కంటే ఈ యేడు సాగు బాగా విస్తీర్ణం తగ్గింది. నియోజకవర్గంలో 1000 అడుగుల వరకు బోరు తవ్వించినా చుక్క నీరు దొరకడం లేదు. బోర్ల కింద ప్రధానంగా పండించే వరి సాగుకు ఇక్కడి రైతులు దూరమయ్యారు. శ్రీ సత్యసాయి జిల్లాలో 2023 ఖరీఫ్‌లో పంటల సాధారణ విస్తీర్ణం 3,13,843 హెక్టార్లు కాగా ఈ యేడు 1,69,843 హెక్టార్లలోనే పంటలు సాగయ్యాయి. అంటే 52 శాతం మాత్రమే సాగైంది. అదేవిధంగా రబీలో 34,212 హెక్టార్లకు గాను 28,192 హెక్టార్లలోనే పంటలు సాగు చేశారు.. వేరుశనగ, వరి, రాగి, మొక్కజొన్న, మల్బరితో పాటు దానిమ్మ తదితర పండ్లతోటలు, తమలపాకులు వక్క తదితర పంటలను సాగు చేశారు వీటిని కాపాడు కునేందుకు రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. నీటి సమస్య కారణంగా వేలాది ఎకరాలు సాగుకు నోచుకోలేదు. దీంతో బీళ్లుగా మారి నేలలు బండ బారి పోతున్నాయి. మడకశిరప్రాంతలో కేవలం నాలుగు హెక్టార్లలోనే వరి సాగైనట్లు సమాచారం. మడకశిర నియోజకవర్గ వ్యాప్తంగా 2320 హెక్టార్లలో మాత్రమే బోర్ల కింద పంటలు సాగైనట్లు అధకారుల లెక్కలు చెబుతున్నాయి. తీవ్ర వర్షాబావ పరిస్థితుల కారణంగా ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు దెబ్బతిని పూర్తిగా నష్టపోయిన రైతులు రబీలో బోర్ల కింద పంటలు సాగు చేసి గటెక్కుదామనుకుంటే నిరాశే ఎదురైంది. అప్పులు చేసి పంటలు సాగు చేసినా బోర్లలో నీటి మట్టం తగ్గి పోయి ఎండిపోతున్నాయి. వాటి ని కాపాడు నేందకు రైతులు పడుతున్న ఇబ్బందులు వర్ణాతీతం.

వెయ్యి అడుగులు తవ్వినా కానరాని చుక్కనీరు

సాగుచేసిన పంటలను తోటలను కాపాడు కోవడానికి రూ. లక్షలు అప్పులు చేసి వేయి అడుగుల వరకు బోరు తవ్వించిన చుక్కనీరు కానరావడం రైతులు కంటితడి పెడుతున్నారు. పంటల సాగుకు, బోర్లు తవ్వించడానికి చేసిన అప్పులు ఎలా తీర్చాలో దిక్కుతోడచడం లేదంటున్నారు. నియోజకవర్గం పరిధిలో అగళి మండలంలోని హెచ్‌డీ హళ్లి తండా గ్రామంలో భూగర్భజలాలు అడుగంటి తీవ్ర నీటి ఎద్దడి నెలకొంది. భూములున్నా పంటలు సాగు చేయలేని దుస్థితి ఆ గ్రామస్థులది. ఆరు నెలల్లోనే హెచ్‌డీ హళ్లి రైతులు తమ పొలాల్లో 30దాకా బోర్లు తవ్వించారు. వాటిలో ఒక్కదానిలో మాత్రమే అరకొర నీరు లభించింది. మిగతా వాటిలో చుక్క నీరు కూడా రాలేదు. వాటి కోసం చేసిన అప్పులు ఎలా తీర్చాలో దిక్కుతోచడం లేదని ఆ రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వేల ఎకరాలు బీడు

గత సంవత్సరం తీవ్ర వర్షాబావ పరిస్థితుల కారణంగా ఖరీఫ్‌లో పంటలు సాగు చేయక రైతులు వేలాది ఎకరాలను బీళ్లుగా వదిలేశారు. భూగర్భజలాలు అడుగంటి బోర్లు ఎండి పోవడంతో వాటి కింద వందలాది ఎకరాల భూములు రబీలోనూ బీళ్లుగా దర్శనిమిస్తున్నాయి. బోర్ల కింద సాగు చేసిన పండ్లతోటలను, వక్క తదితర పంటలను కాపాడుకోనేందుకు రైతులు పడుతున్న ఇబ్బందులు వర్ణాతీతం. ఇలాంటి పరిస్థితి తామెన్నడు చూడలేదని రైతులు ఆవేదన వక్తం చేస్తున్నారు. జిల్లావ్యాప్తంగా గత సంవత్సరం రబీలో 34 వేల హెక్టార్లలో పంటలు సాగు చేయగా ఈ యేడు 24 వేల హెక్టార్లలోనే సాగు చేశారు. అంటే 10వేల హెక్టార్ల సాగు విస్తీర్ణం తగ్గింది. హంద్రీనీవా కాలువల ద్వారా కృష్ణానది జలాలు చెరువులకు చేరితేనే ఈ ప్రాంతంలో తమ కష్టాలు తీరతాయని రైతులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

మల్బరీ తోట ఎండిపోతోంది..



సాగుచేసిన పంటలను పంటలను కాపాడు కోవడానికి రూ.లక్షలు అప్పులు చేసి బోర్లు తవ్వించినీ చుక్క నీరు దొరక లేదు. వెయ్యి అడుగులు బోర్లు తవ్వించినా ఫలితం లేదు. నాకున్న నాలుగెకరాల్లో మల్బరీ సాగు చేశా. గతంలో వేసిన బోరలో నీరు రావడంలేదు.. దీంతో మల్బరీ పంట కాస్త ఎండిపోతోంది. బోర్లు తవ్వించేందుకు రూ.3 లక్షలదాకా అప్పుచేయాల్సి వచ్చింది. నీరు రాలేదు. దీంతో పంట పూర్తిగా దెబ్బతింది. బోర్లు తవ్వించేందుకు చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియడం లేదు.

- దేవరాజు, రైతు, హెచ్‌డీ హళ్లి

ఐదు బోర్లు తవ్వించినా చుక్కనీరు లేదు

నాకు ఏడెకరాల పొలం ఉంది. ఒక చోట ఐదెకరాలు, మరో చోట రెండెకరాలు. గత సంవత్సరం ఖరీఫ్‌లో వేరుశనగ పంట దెబ్బతిని నష్టపోయా. కనీసం బోరు తవ్వించి, దాని కింద పంటలు సాగు చేసి అప్పుల నుంచి గట్టెక్కుదామనుకున్నా. దీంతో ఐదెకరాల పొలంలో రూ.5 లక్షలు ఖర్చుపెట్టి ఐదు బోర్లు తవ్వించా. చుక్కనీరు దొరక లేదు. చేసేదేమీలేక ఐదెకరాలను బీడుగా వదిలేశా. బోర్లు తవ్వించేందుకు చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియడం లేదు. గతంలో పత్తి, రాగి, వేరుశనగ పంటలు సాగు చేసేవాళ్లం. ప్రస్తుతం బీడుగా వదిలేశాం. కృష్ణానది జలాలతో చెరువులను నింపితేనే మా ప్రాంతంలో సాగు తాగు నీటి సమస్య పరిష్కారం అవుతుంది.

- సురేష్, రైతు, హెచ్‌డీ హళ్లి



ఎండిపోయిన వేరుశనగ పంటను చూపుతున్న రైతు సురేష్